
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శనివారం, 22 జూన్ 2024
3



	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	26	39
భద్రాద్రి	22	38



ఖమ్మంలోని పటేల్ స్టేడియంలో యోగా చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

యోగాతో ఆరోగ్యం, ఆనందం

వివరాలు : 4లో

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- నగరంలోని ఎస్పీ స్టేడియంలో యోగా డే



ఏరువాకలో నాగలి పట్టి దున్నుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

నాగలి పట్టి.. దుక్కి దున్ని..

వివరాలు : 4లో

- ఏరువాకలో పాల్గొన్న సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి
- బేతుపల్లి చేలల్లో సందడి

నేడు రెవెన్యూ శాఖ మంత్రి
పొంగులేటి పర్యటన



నేలకొండపల్లి, జూన్ 21: పాలేరు శాసనసభ్యుడు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం నేలకొండపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఉదయం 10గంటలకు మూటాపురం, 10.30గంటలకు శంకరగిరితండా, 11గంటలకు రాజేశ్వరపురం, 11.30లకు అమ్మగూడెం, 12గంటలకు కోరట్లగూడెం, 12.30లకు కోనాయగూడెం, మధ్యాహ్నం 1గంటకు ఆరెగూడెం, 1.30లకు ఆచార్లగూడెం, 2గంటలకు బోదులబండ, 2.30లకు మండ్రాజుపల్లి గ్రామాలలో మంత్రి పర్యటిస్తారని మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి తెలిపారు. ప్రజలు, పార్టీ కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.



గంజాయి గుప్పు.. పోలీస్ లుక్కు..

- గంజాయి రవాణాపై మళ్లీ నిఘా
- ఇరు రాష్ట్రాలు పట్టు బిగిస్తే ఆటకట్టు
- ఇప్పటికే స్మగ్లర్ల పట్ల కఠినంగా వ్యవహరించాలన్న సీఎం రేవంత్
- తాజాగా ఏపీ హోం మంత్రి అనిత హెచ్చరికలు
- ఇరు రాష్ట్రాల పోలీసు, ఎక్సైజ్ అధికారుల సమన్వయం ఎంతో కీలకం

భద్రాచలం, జూన్ 21: ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల నుంచి తెలంగాణకు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న గంజాయికి చెక్ పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. తరచూ ఏవోబీ నుంచి భద్రాచలం మీదుగా గంజాయిని అక్రమంగా తరలిస్తున్న సంఘటనలు ఎన్నో ఉంటున్నాయి. అసలు ఏవోబీ నుంచి గంజాయి ఏ విధంగా రాష్ట్రంలోకి ప్రవేశిస్తోంది అనే అంశాలపై విచారణ చేపట్టి బాద్యులపై కఠినంగా వ్యవహరించాలని ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులకు రాష్ట్ర సీఎం ఎనముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. దీంతో ఏవోబీ నుంచి భద్రాచలం మీదుగా వివిధ రాష్ట్రాలకు గంజాయి తరలిస్తుండటంపై పోలీసు ఉన్నతాధికారులు దృష్టిసారించారు. ఫలితంగా గత ఆరు నెలల్లో సుమారుగా నాలుగువేల కిలోల గంజాయి పట్టుబడగా రూ.10 కోట్ల వరకు మార్కెట్లో దీని విలువ ఉంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. పోలీసు, ఎక్సైజు శాఖ అధికారులు పట్టుకుంటున్నది గోరంతైనా.. తరలిపోతున్నది కొండంతనే విమర్శ లేకపోలేదు. ఇందుకు రాష్ట్రంలో విచ్చలవిడిగా గంజాయి వినియోగం పెరగడమే కారణమనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఏడాది కాలంగా ఏవోబీ నుంచి భద్రాచలం మీదుగా వేల కిలోల గంజాయి తరలిపోయింది. ఏవోబీ నుంచి భద్రాచలం మీదుగా హైదరాబాద్‌తో పాటు ఏపీ, ఢిల్లీ, హర్యానా, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాలకు గంజాయి తరలిస్తున్నారు.

2023లో భద్రాచలం గోదావరి వారధి చెక్‌పోస్టు వద్ద 19 కేసుల్లో 1,171 కేజీల గంజాయిని పట్టుకోగా 69 మందిని అరెస్టు చేశారు. ఈ పట్టుబడ్డ గంజాయి విలువ రూ.3,61,75,000 ఉంటుందని అంచనా, కాగా శుక్రవారం సినీ ఫక్కీలో గంజాయిని తరలిస్తుండగా తమిళనాడుకు చెందిన ముగ్గురిని ఖమ్మం ఎక్సైజు ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు పట్టుకున్నారు. వారి నుంచి 228 కేజీల గంజాయి, కారు, రెండు సెల్‌ఫోన్లు, రూ.5,500 నగదుతో పాటు శ్రీలంక, బంగ్లాదేశ్ కరెన్సీ కూడా పట్టుబడిందని ఎక్సైజు అధికారులు పేర్కొన్నారు.

ఏవోబీ నుంచి ఇలా తరలుతోంది

ఆంధ్రా, ఒడిశా, సరిహద్దులు(ఏవోబీ) నుంచి భద్రాద్రి మీదుగా వివిధ రాష్ట్రాలకు గంజాయి తరలిపోతోంది. ఈ గంజాయిని ప్రధానంగా ఒడిశా రాష్ట్రంలోని మల్కనగిరి జిల్లా పరిధిలోని పలు గ్రామాల్లో పండిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో స్మగ్లర్లు నేరుగా రంగ ప్రవేశం చేయకుండా తమకు అనుకూలురైన వారితో గంజాయిని వివిధ రాష్ట్రాలకు ఏపీలోని చింతూరు, నెల్లిపాక, తెలంగాణలోని భద్రాచలం మీదుగా వివిధ రాష్ట్రాలకు తరలుతోంది. వాస్తవానికి మల్కన్‌గిరి జిల్లాలో కలిమెల, మోటు నుంచి చింతూరు అనంతరం భద్రాచలం మీదుగా తరలిస్తుండగా మరో వైపుగా సీలేరు, డొంకరాయి నుంచి చింతూరు వైపు వచ్చి భద్రాచలం మీదుగా తరలిస్తున్నారు. అదేవిధంగా మల్కనగిరి నుంచి సుక్మా కుంటల నుంచి చింతూరు భద్రాచలం మీదుగా గంజాయిని అక్రమంగా స్మగ్లర్లు తరలిస్తున్నారని తెలుస్తోంది. ఈ గంజాయిని ప్రధానంగా హైదరాబాద్‌తో పాటుఏపీ, మహారాష్ట్ర, ఢిల్లీ, హర్యానా, తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాలకు తరలించడం జరుగుతోంది.

ఇదిలా ఉండగా పట్టుబడ్డ వారిలో 90 శాతం మంది యువతే ఇందులో ఉంటుండటం గమనించదగ్గ విషయం. జల్సాలకు, క్రికెట్ బెట్టింగ్, మద్యానికి బానిసై ఖర్చుల నిమిత్తం అప్పులను తీర్చడానికి యువత సులభంగా డబ్బు సంపాదించవచ్చనే భావనతో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలుతోంది. గత కొన్నేళ్లుగా గంజాయి అక్రమ రవాణా చేస్తూ పట్టుబడుతున్న వారిలో అసలు కీలక సూత్రదారులు పట్టుబడ్డ దాఖలాలు అతి స్వల్పమే అనే వ్యాఖ్యలు సైతం లేకపోలేదు. (మిగతా 4వ పేజీలో)

రైతుల్లో జోష్

- ఎట్టకేలకు రూ.2లక్షల రుణమాఫీ అమలుకు సర్కారు నిర్ణయం
- ఉమ్మడి జిల్లాలో 5 లక్షల 59 వేల మంది రుణ గ్రహీతలు
- రుణమాఫీ పొందేవారిపై కసరత్తు
- రైతుల్లో 70 శాతం వరకు లబ్ధి
- 'రైతుభరోసా' సబ్‌కమిటీలో జిల్లా నుంచి ముగ్గురు మంత్రులకు చోటు



ఖమ్మం, జూన్ 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతులకు రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తున్నట్టు సీఎం ప్రకటించడంతో ఉమ్మడి జిల్లా రైతన్నల్లో జోష్ నెలకొంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రుణమాఫీ ప్రకటనపై కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ రావడం కోడ్ అమల్లో ఉండడంతో గత రెండు నెలలుగా ఈ విషయంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. దీంతో రైతు రుణమాఫీపై అనేక అనుమానాలు అపోహలు నెలకొన్నాయి. కోడ్‌తొలిగిన నేపథ్యంలో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినేట్ సమావేశంలో రూ.2 లక్షల రుణమాఫీకి రైతుభరోసా పెంచి ఇచ్చేందుకు కీలక నిర్ణయం తీసుకుంది. అసెంబ్లీ ఎన్నికల ముందు పార్టీ అదినేత రాహుల్‌గాంధీ వరంగల్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. దీంతో 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు రైతులు తీసుకన్న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తున్నట్టు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అయితే విధి విధానాలు ఇంకా వెల్లడించలేదు. వాస్తవానికి ఖమ్మం జిల్లాలో గత డిసెంబరు 31 వరకు ఖమ్మం జిల్లాలో మొత్తం 3,73,157 మంది రైతులు రూ.4307.58 కోట్ల రుణాలు తీసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,86,034 మంది రైతులు రూ.1816.35 కోట్లు రుణాలు తీసుకున్నారు. రెండుజిల్లాల్లో రూ.50 వేల నుంచి 5 లక్షల వరకు రుణాలు తీసుకున్న రైతులున్నారు. అయితే 2 లక్షలలోపు జాబితా విడుదల చేయాల్సి ఉంది. ఉభయ జిల్లాల్లో 50 నుంచి 70 శాతం వరకు రుణమాఫీ లబ్ధిపొందే అవకాశం కనిపిస్తుంది. మొత్తం రూ.2 లక్షల రుణమాఫీ రైతులకు భరోసా కల్పించబోతుంది.

దీంతో పాటు ప్రస్తుతం ఇస్తున్న రైతుబంధుకు బదులు రైతుభరోసా సాగు సాయం పెంచి ఎకరానికి రూ.15 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మంత్రి మండలి ఉపసంఘం నియమించారు. నలుగురు మంత్రులలో ఖమ్మం జిల్లా నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మరో మంత్రి శ్రీధర్‌బాబు ఈ కమిటీలో సభ్యులు. సబ్‌కమిటీలో ముగ్గురు ఖమ్మం జిల్లా నుంచే ఉండటం విశేషం.

సింగరేణికి కష్టకాలం

- నూతన బొగ్గు గనులతోనే మనుగడ
- వేలంలో పాల్గొనకుంటే ముప్పు తప్పదు
- గతంలో సత్తుపల్లి, ఇల్లెందులో ప్రైవేటు సంస్థలకు రెండు గనుల కేటాయింపు
- సింగరేణికి బేషరతుగా బ్లాకులను కేటాయించాలంటున్న రాష్ట్ర సర్కారు
- గత బీఆర్‌ఎస్ సర్కారు తీరుతోనే సమస్యలు
- కేంద్ర ప్రభుత్వ వైఖరిపై సింగరేణిలో కార్మిక సంఘాల ఆందోళనలు

తెలంగాణ నల్ల బంగారంగా విలసిల్లుతున్న సింగరేణికి కష్టకాలం దాపురించింది. గత ప్రభుత్వం నూతన బొగ్గు గనుల ఏర్పాటులో సంకుచిత రాజకీయ వైఖరులు అవలంభించడంతో సంస్థ మనుగడకే ముప్పు ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వ విధానాలతో బొగ్గు గనులను బహిరంగ వేలం ద్వారా ప్రైవేటు సంస్థలకు కేటాయిస్తుండటంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో జరిగిన వేలంలో సింగరేణి సంస్థ పాల్గొనకుండా బీఆర్‌ఎస్ సర్కారు చర్యలు తీసుకోవడంతో సత్తుపల్లి, ఇల్లెందు కోయగూడెం బొగ్గు బ్లాకులు ప్రైవేటు సంస్థలకు దక్కాయి. తాజాగా శ్రావణపల్లి బ్లాకును వేలం వేయడంతో రాష్ట్ర సర్కారు రంగంలోకి దిగింది. వేలం విధానం సింగరేణి మనుగడకే ముప్పుగా మారిందని, బొగ్గు బ్లాకులను బేషరుతుగా సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం సింగరేణి వ్యాప్తంగా కార్మిక సంఘాలు సైతం ఆందోళనల బాట పట్టాయి. లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న సింగరేణి పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. -ఇల్లెందు



నిరసన తెలిపిన కార్మికులు, ఉద్యోగులు

రుద్రంపూర్(సింగరేణి) జూన్ 21 : కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌లకు టెండర్లు నిర్వహించడాన్ని నిరసిస్తూ సింగరేణి ప్రధాన కార్యాలయంతో పాటు పలు డిపార్టుమెంట్‌లలో కార్మికులు, ఉద్యోగులు, కార్మికసంఘాల నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సింగరేణి సంస్థ గత వందేళ్లుగా బొగ్గుగనులను నిర్వహిస్తూ వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తుందని, సింగరేణికే తెలంగాణలోని బొగ్గుబ్లాక్‌లను కేటాయించాలని కార్మిక సంఘాల నాయకులు మందా నర్సింహారావు, వంగా వెంకట్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని వెంటనే బొగ్గుబ్లాక్‌ల టెండర్లను రద్దు చేసి ఉన్న బ్లాక్‌లన్నింటినీ సింగరేణికే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికసంఘాల నాయకులు రమణమూర్తి, క్రిస్టఫర్ తదితరులు పాల్గొన్నారు. కేంద్రం బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి అప్పగించాలని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్, ఉపాధ్యక్షుడు దాసరి రాజారాం డిమాండ్ చేశారు. ఇల్లెందు ఏరియాలోని వివిధ మైన్లు, డిపార్టుమెంట్ల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ఆందోళన చేశారు. టేకులపల్లిలో కూడా కార్మికులు నిరసనలు వ్యక్తం చేశారు.



కొత్తగూడెంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న కార్మికసంఘాల ప్రతినిధులు

కేటీపీఎస్ స్క్రాప్ తరలింపును నిలిపివేయాలి..

- టెండర్లలో అక్రమాలపై నిగ్గు తేల్చే వరకు విశ్రమించను
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన.. సీఈతో భేటీ..



కేటీపీఎస్‌లో అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ, జూన్ 21 : కేటీపీఎస్ స్క్రాప్ టెండర్లలో అక్రమాలపై నిగ్గు తేల్చే వరకు విశ్రమించేది లేదని, అప్పటి వరకు స్క్రాప్ తరలింపు పనులను నిలిపి వేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టంచేశారు. కేటీపీఎస్ స్క్రాప్ తరలింపులో జరుగుతున్న అక్రమాలను ఏప్రిల్ 2న ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకొచ్చిన విషయం విదితమే. ఈ క్రమంలో శుక్రవారం ఎమ్మెల్యే సాంబశివరావు పాల్వంచలోని కేటీపీఎస్ 7వ దశను ఆకస్మికంగా సందర్శించారు. సీఈ, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. స్క్రాప్ తరలింపు టెండర్లలో అవకతవకలు జరిగాయంటూ వస్తున్న ఆరోపణలను ఆయన కేటీపీఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆరోపణలు వచ్చినప్పుడు నిర్ధోషిత్వాన్ని నిరూపించుకోవాల్సిన బాధ్యత కేటీపీఎస్ స్థానిక అధికారులు, ఉన్నతాధికారులపై ఉంటుందని అన్నారు. విచారణ దశ, విచారణ నివేదికలపై అధికారులను ప్రశ్నించారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కోట్ల విలువైన ప్రజాధనం దుర్వినియోగమైందని వస్తున్న వార్తల నేపథ్యంలో సమగ్ర విచారణ జరిపి నిజాలను ప్రజల ముందు ఉంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే గత ప్రభుత్వంలో జరిగిన టెండర్ ప్రక్రియపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. తెలంగాణకు తలమానికంగా ఉన్న కేటీపీఎస్ కర్మాగారంలో అవినీతిని సహించే ప్రసక్తి లేదని అన్నారు. టెండర్ ప్రక్రియకు సంబంధించిన వివరాలు, విచారణ కమిటీ ఇచ్చిన నివేదికను అందజేయాలని, త్వరలోనే పూర్తి స్థాయి సమీక్ష ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో సీఈ పాలకుర్తి వెంకటేశ్వరరావు, తహశీల్దార్ వివేక్, మునిసిపల్ కమిషనర్ స్వామి, కేటీపీఎస్ అధికారులు, సీపీఐ నాయకులు సాబీర్‌పాషా, ముత్యాల విశ్వనాథం, పూర్ణ, సాయిబాబా, ఉప్పుశెట్టి రాహుల్, ఏఐటీయుసీ నాయకుడు సుధాకర్, ముత్యాల కిరణ్, అన్నారపు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భార్యను రక్షించబోయి భర్త...

- విద్యుదాఘాతంతో దంపతుల మృతి
- వైరాలో విషాదం



ఆంజనేయులు, నరసమ్మ దంపతులు

వైరా, జూన్ 21: విద్యుదాఘాతంతో వైరా పట్టణంలో దంపతులు మృతిచెందారు. వైరా మున్సిపాలిటీ హనుమాన్ బజార్లో శుక్రవారం రాత్రి 9.30 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఆంజనేయులు (60), నరసమ్మ (55) దంపతులకు భాస్కర్, సతీష్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వారు తమ చిన్న కుమారుడు సతీష్‌తో కలిసి నివాసం ఉంటున్నారు. కుమారుడు, కోడలు ఇంట్లోని ముందు భాగంలో ఉంటుండగా వెనుక భాగంలో ఆంజనేయులు, నరసమ్మ నివాసముంటున్నారు. శుక్రవారం రాత్రి నరసమ్మ బాత్రూంకి వెళ్లిన సమయంలో దుస్తులు ఆర వేసుకునే వైర్ నుంచి విద్యుత్ ప్రసరించడంతో కేకలు వేసింది. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న ఆంజనేయులు బయటకు వచ్చి భార్య నర్సమ్మను కాపాడే ప్రయత్నంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. తల్లిదండ్రుల కేకలతో బయటకు వచ్చిన కుమారుడు సతీష్ ఇరుగుపొరుగు వారి సహాయం తీసుకొని తల్లిదండ్రులను కాపాడేందుకు ప్రయత్నించాడు. నరసమ్మ సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. కొనఊపిరితో ఉన్న ఆంజనేయులును స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ సంఘటన హనుమాన్ బజార్ వాసులను తీవ్రంగా కలిచి వేసింది.

భూ వివాదం.. వ్యక్తి ఆత్మహత్య..

- పోలీస్ స్టేషన్ ముందు బంధువుల ఆందోళన
- కొణిజర్ల మండలం మేకలకుంటలో ఉద్రిక్తత

5

లైనింగ్‌వాల్స్ వద్దు.. గైడ్‌వాల్సే ముద్దు

- వైరా కాల్వల ఆధునీకరణ
- గైడ్‌వాల్స్ నిర్మాణంతోనే పటిష్టం

వైరా, జూన్ 21: వైరా రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వల రెండోదశ ఆధునీకరణకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవతో రూ.42.10కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే ఈ నిధులతో కాల్వల ఆధునీకరణ పనులను సిమెంట్ గైడ్‌వాల్స్ నిర్మాణంతో చేపడితేనే పటిష్టంగా ఉంటాయి. అందుకు విరుద్ధంగా లైనింగ్‌వాల్స్‌ను నిర్మిస్తే ఈ పటిష్టత మొత్తం డొల్లతనంగా మారే ప్రమాదముంది. వైరా కుడి, ఎడమకాల్వలు నల్లరేగడి(బీసీ మట్టి)తో ఉన్నాయి. ఈ నల్లరేగడి మట్టిలో లైనింగ్‌వాల్ నిర్మిస్తే అవి కొంతకాలానికే పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరదు.

వందేళ్లనాడు నిజాం నిర్మించిన వైరా రిజర్వాయర్

వైరా రిజర్వాయర్‌ను నిజాం నవాబు వందేళ్ల కిందట నిర్మించారు. 1922-23ప్రాంతంలో ఈ రిజర్వాయర్ నిర్మాణాన్ని నిజాంనవాబు ప్రారంభించారు. 1929-30నాటికి నిర్మాణాన్ని పూర్తిచేసి కుడి, ఎడమకాల్వల 12వేల ఎకరాల పైచిలుకు ఆయకట్టుకు నీరు సరఫరా చేశారు. 1969లో లోకలైజేషన్ చేయగా కుడి, ఎడమకాల్వల ఆయకట్టు 12వేల నుంచి 17300 ఎకరాలకు పెరిగింది. అయితే ఈ కాల్వలకు ఏనాడూ పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయలేదు. నిజాంనవాబు ఈ కాల్వలను రివిట్‌మెంట్‌తో నిర్మించారు. కాలక్రమంలో ఆరివిట్‌మెంట్ దెబ్బతిన్నది. దాంతో కాల్వగట్లు బలహీనపడ్డాయి. ప్రతి ఏటా సీజన్‌లో చివరి ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బందులపాలయ్యారు. పూర్తిస్థాయిలో నీరు సరఫరా చేస్తే కాల్వగట్లకు గండ్లు పడేవి.

2007లో భట్టి చొరవతో జైకా నిధుల మంజూరు..

ఈకాల్వల స్థితిగతులపై వైరా మండలానికి చెందిన ప్రస్తుత ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క 2006-07 ప్రాంతంలో అప్పటి ఉమ్మడి ఏపీ డిప్యూటీ సీఎం, ఖమ్మంజిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అయిన కోనేరు రంగారావు సహకారంతో సర్వే చేయించారు. వెంటనే అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి ద్వారా జపాన్ బ్యాంకు నుంచి రూ.50.43కోట్ల నిధులు మంజూరు చేయించారు. కుడికాల్వ 14,994ఎకరాలు, ఎడమకాల్వ కింద 7636ఎకరాలు మొత్తం 22,630ఎకరాల ప్రతిపాదిత ఆయకట్టు ఆధునీకరణ కోసం ఈ నిధులను మంజూరు చేయించారు. ఆ నిధులకు సంబంధించి 2009 జనవరి 4న ఈ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. మూడేళ్లలో ఈ ఆధునీకరణ పనులను పూర్తిచేశారు. అయితే రూ.50.43కోట్ల నిధుల భారం రూ.65కోట్లకు పెరిగింది.



బలహీనంగా ఉన్న కుడికాల్వ గట్లు

నాడు లైనింగ్‌వాల్స్‌కు మంజూరు అయినప్పటికీ సిమెంట్ గైడ్‌వాల్స్ నిర్మాణం..

నాడు కూడా ఈ కాల్వల ఆధునీకరణ కింద లైనింగ్‌వాల్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అయితే ఈ కాల్వల నేలలు నల్లరేగడితో ఉన్నందున లైనింగ్‌వాల్స్ సురక్షితం కాదని నిర్ధారించి వచ్చిన నిధులతో సిమెంట్ గైడ్‌వాల్స్ నిర్మించారు.

నాడు జరిగిన పనుల వివరాలిలా ఉన్నాయి...

జపాన్ బ్యాంకు నిధులతో కుడికాల్వలో 7.8కిలోమీటర్ల దూరం సిమెంట్ గైడ్‌వాల్స్ నిర్మించారు. ఇంకా 23.5 కిలోమీటర్ల దూరం సిమెంట్ గైడ్‌వాల్స్ నిర్మించాల్సి ఉంది. ఈ కాల్వ పరిధిలో 29 డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. అయితే కేవలం 7.8కిలోమీటర్లు మాత్రమే సిమెంట్ గైడ్‌వాల్స్ నిర్మించినందున మిగిలిన కాల్వలను కూడా ఆధునీకరణ చేయాల్సిన అత్యవసర పరిస్థితులు ఉన్నప్పటికీ గత పదేళ్ల కాలంలో అప్పటి ప్రభుత్వం ఈ కాల్వల అభివృద్ధికి పైసా నిధులు కేటాయించలేదు. అలాగే ఎడమకాల్వ పరిధిలో 9.55కిలోమీటర్ల దూరం సిమెంట్ గైడ్‌వాల్స్ నిర్మించారు. ఈ కాల్వ విప్పలమడక-నారపనేనిపల్లి మధ్య నుంచి గరికపాడు, లింగన్నపాలెం కాల్వలుగా చీలిపోతున్నాయి. గరికపాడు వైపు ఇంకా ఐదున్నర కిలోమీటర్లు, లింగన్నపాలెం బ్రాంచ్‌కెనాల్‌లో మూడున్నర కిలోమీటర్లు సిమెంట్ గైడ్‌వాల్స్‌ను నిర్మించాల్సి ఉంది. ఇప్పటివరకు నిధులు లేక ఈ కాల్వలు అధ్వానంగా ఉన్నాయి.

భట్టి చొరవతో రూ.42.10కోట్లు మంజూరు...

డిప్యూటీ సీఎంగా భట్టి బాధ్యతలు చేపట్టిన తొలిసారి వైరా మండలంలోని తమ స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురానికి వచ్చిన సమయంలో వైరా కుడి, ఎడమకాల్వల్లో మిగిలిన ఆధునీకరణ పనుల కోసం అవసరమైన ప్రతిపాదనలు తనకు పంపించాలని నీటిపారుదలశాఖ అధికారులను భట్టి ఆదేశించారు. దాంతో కుడి, ఎడమకాల్వల్లో సిమెంట్ గైడ్‌వాల్స్ నిర్మాణం కోసం దాదాపు రూ.88.60కోట్ల నిధులు అవసరమవుతాయని నీటిపారుదలశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అయితే ప్రభుత్వం నుంచి రూ.42.10కోట్ల నిధులు మాత్రమే మంజూరయ్యాయి.

లైనింగ్‌వాల్స్‌కు నిధులు మంజూరు చేసిన అధికారులు

నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు వైరా కాల్వల్లో



2010లో నిర్మించిన సిమెంట్ గైడ్‌వాల్స్

ఆధునీకరణ పనుల్లో భాగంగా సిమెంట్ లైనింగ్ వాల్స్‌కోసం రూ.42.10కోట్ల నిధులు సరిపోతాయని భావించి ఆమేరకు మంజూరు చేశారు. ఈ కాల్వల్లో గైడ్‌వాల్స్ నిర్మాణానికి ప్రభుత్వ నిబంధనలు అనుమతించవని అందువల్ల ఎన్నెస్పీ కాల్వల్లో మాదిరిగానే ఇక్కడా లైనింగ్‌వాల్స్‌నే నిర్మించాలని అందుకు ఈ నిధులు సరిపోతాయని అధికారులు స్పష్టం చేశారు. సిమెంట్ గైడ్‌వాల్స్ నిర్మాణానికి తాము అనుతించే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. సిమెంట్ గైడ్‌వాల్స్‌కైతే రూ.88.60 కోట్లు అవసరమవుతాయని, లైనింగ్‌వాల్స్‌కైతే రూ.42.10కోట్లు సరిపోతాయని స్పష్టం చేస్తూ ఆమేరకు నిధులు మంజూరు చేశారు. అయితే గతంలో నిర్మించిన గైడ్‌వాల్స్ పటిష్టంగా ఉన్నాయని, సాగునీరు వృథాకాకుండా చివరి ఆయకట్టుకు కూడా నీరు సక్రమంగా సరఫరా చేయగలుగుతున్నామని అందువలన వాటి నిర్మాణానికే అనుమతించాలని స్థానిక నీటిపారుదలశాఖ అధికారులు ఉన్నతాధికారులకు నివేదించినా వారు ససేమిరా అంగీకరించటం లేదు. కుడికాల్వలో ఇంకా 23 కిలోమీటర్లకుగానూ 20.5కిలోమీటర్ల వరకు కాల్వలను ఆధునీకరిస్తే నీటి సరఫరా సక్రమంగా జరుగుతుందని అలాగే 4, 28 డిస్ట్రిబ్యూటరీలను కూడా ఆధునీకరించాలని స్థానిక నీటిపారుదలశాఖ అధికారులు ప్రతిపాదనలు తయారుచేశారు. ముఖ్యంగా ఈ కాల్వలు 20వ డిస్ట్రిబ్యూటరీ నుంచి 24వ డిస్ట్రిబ్యూటరీ వరకు బ్యాకింగ్ వలన విధిగా సిమెంట్ గైడ్‌వాల్స్‌ను నిర్మించాల్సి ఉంది. ఇప్పుడున్న వచ్చిన నిధులతో 8వ డిస్ట్రిబ్యూటరీ నుంచి 16వ డిస్ట్రిబ్యూటరీ వరకు ఐదుకిలోమీటర్ల దూరం సిమెంట్ గైడ్‌వాల్స్‌ను అలాగే మిగిలిన దూరం కాల్వగట్లకు లైనింగ్ వాల్స్‌ను నిర్మించే దిశగా స్థానిక అధికారులు చర్యలు చేపడుతున్నారు. అలాగే ఎడమకాల్వలో గరికపాడు కెనాల్‌లో మూడున్నర కిలోమీటర్లు, లింగన్నపాలెం బ్రాంచ్ కెనాల్‌లో రెండుకిలోమీట ర్లు అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. వీటిలో కూడా కొంతదూరం సిమెంట్ గైడ్‌వాల్స్ మరికొంత దూరం లైనింగ్‌వాల్స్ నిర్మించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. అయితే ఈ కాల్వల నేలల స్వభావాన్ని బట్టి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ తీసుకొని గతంలో మాదిరిగానే పూర్తిస్థాయిలో సిమెంట్ గైడ్‌వాల్స్‌ను నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

జ్యేష్ఠాభిషేక మహోత్సవానికి అంకురార్పణ

- నేడు 81 కలశాలతో స్నపనం
- నేడు నిత్య కల్యాణాలు నిలిపివేత

భద్రాచలం, జూన్ 21: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం జ్యేష్ఠాభిషేక మహోత్సవాలకు శ్రీకారం చుట్టారు. శనివారం జ్యేష్ఠాభిషేక మహోత్సవాన్ని సంప్రదాయబద్దంగా నిర్వహించనున్నారు. శుక్రవారం అంకురార్పణలో భాగంగా పవిత్ర గోదావరి నుంచి తీర్థ బిందెతో నీటిని తీసుకొచ్చి యాగశాల వద్ద ఉత్సవ అంకురార్పణ గావించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే జ్యేష్ఠాభిషేకంలో పాల్గొనే వైదిక సిబ్బందికి ఆలయ అధికారులు దీక్షా వస్త్రాలను అందజేశారు. అంతకు ముందు జ్యేష్ఠాభిషేక అంకురార్పణలో భాగంగా విశ్వక్సేన పూజ, పుణ్యాహావచనం, కంకణధారణ ఇతర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఉదయం జ్యేష్ఠాభిషేక భాగంగా హవనం, పూర్ణాహుతి, 81 కలశాలతో స్వామి వారికి అభిషేకం(స్నపనం), ఉత్సవ సమాప్తి నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ముఖ్య అర్చకులు పొడిచేటి రామభద్రాచార్యులు, కోటి విష్ణువర్ధనాచార్యులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జేష్ఠాభిషేకాన్ని పురస్కరించుకొని శనివారం రామయ్యకు నిత్య కల్యాణాన్ని నిలిపివేశారు.



పూజా సామగ్రితో వైదిక సిబ్బంది

స్వర్ణభద్రకవచాలతో దర్శనమిచ్చిన భద్రాద్రి రామయ్య

- స్వామి వారిని దర్శించుకున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

భద్రాచలం, జూన్ 21: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారు శుక్రవారం సందర్భంగా స్వర్ణభద్ర కవచాలతో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే స్వామి వారిని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. కలెక్టర్ ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కాగా వారికి దేవస్థానం అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలుకగా వైదిక సిబ్బం ది వేద ఆశీర్వచనం అందజేశారు. ప్రతీక్‌జైన్ ఇటీవల వరకు భద్రాచలం ఐటీడీఏ పీవోగా బాధ్యతలు నిర్వహించి ఉద్యోగోన్నతిపై వికారాబాద్ కలెక్టరుగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఈ వి.రవీంద్రనాథ్, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, వేద పండితులు చిట్టి హనుమత్‌శాస్త్రి, దేవస్థానం రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు ఐటీడీఏ పీవో సీసీ గణేష్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణంను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.



కలెక్టర్ దంపతులను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

అగౌరవ పరిచిన చోటే దక్కిన గౌరవం

- చంద్రబాబు అసెంబ్లీకి రావడం పట్ల సంబురాలు

ఖమ్మం మామిళ్లగూడెం, జూన్ 21: ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు 2021 నవంబరు 19న అసెంబ్లీ సాక్షిగా అవమానపరిచిన వైసీపీ ప్రభుత్వం నేడు అదే అసెంబ్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయడం పట్ల జిల్లా దేశం నేతలు సంబురాలు నిర్వహించారు. అగౌరవ పరిచిన చోటే గౌరవంగా అధికారం దక్కించుకున్నా రని టీడీపీ నేతలు అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయం లో సంబురాలు నిర్వహించారు. ఆ నాడు ప్రతిపక్ష నేతగా చంద్రబాబునాయుడుని ఆయన సతీమణిని, తన కుటుంబ సభ్యులను అగౌరవపరిచారని అప్పుడు ఇది గౌరవ సభ కాదు, కౌరవ సభ అని చెప్పి ఈ అసెంబ్లీలో మళ్లీ అడుగు పెడితే ముఖ్యమంత్రిగానే అడుగు పెడతానని లేకపోతే ఈ సభకు రానని నాడు చంద్రబాబు శపథం చేశారని ఆ శపథాన్ని నేడు నిజం చేసుకున్నారని అన్నారు. నాలుగో సారి ముఖ్యమంత్రిగా శుక్రవారం అసెంబ్లీలో అడుగుపెట్టిన సందర్భంగా ఖమ్మం తెలుగుదేశం పార్టీ ఆఫీసులో పార్టీ ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్ చంద్ర ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేశారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, చంద్రబాబు అభిమానులు యర్రం జేమ్స్, బుడిగె శ్రీను, రవీందర్, కన్నేటి పృథ్వి, చింతనిప్పు నాగేశ్వరరావు, నాగండ్ల లక్ష్మణ్, బోడేపూడి రవి, నర్సింహారావు, రామానుజం తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి సంబురాలు నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

మద్యం తాగి పాఠశాలలో పడిపోయిన ఉపాధ్యాయుడు

● ఎంఈవోకు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు ● ములకలపల్లి మండలంలో ఘటన

ములకలపల్లి, జూన్ 21: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం తిమ్మంపేట పంచాయతీ పరిధిలోని రాజీవ్‌నగర్ నగర్ ప్రాథమిక పాఠశాలలో విధుల నిర్వహిస్తున్న ప్రత్తిపాటి వీరయ్య అనే ఉపాధ్యాయుడు శుక్రవారం పూటుగా మద్యం తాగి పాఠశాలకు వచ్చాడు. మద్యం మత్తులో తరగతి గదిలోనే పడిపోవటంతో కొందరు విద్యార్థులు తల్లిదండ్రులకు చెప్పటంతో గ్రామస్థులు పాఠశాలకు వచ్చారు. పాఠశాలలో పడిపోయి ఉన్న ఉపాధ్యాయుడిని పశువుల పాకలోకి తరలించి ఎంఈవోకు సమాచారం ఇచ్చారు. ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై ఎంఈవో శ్రీరాంమూర్తిని వివరణ కోరగా మద్యం సేవించి పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు ఇచ్చి చర్యలు తీసుకుంటామన్నారు.



మద్యం మత్తులో ఉన్న ఉపాధ్యాయుడు

తల్లాడకు రాష్ట్రస్థాయి స్టార్ ఈఎంటీ అవార్డు

తల్లాడ, జూన్ 21: 108సంస్థలో ఈఎంటీగా పనిచేస్తున్న తల్లాడకు చెందిన నల్లగట్ల రామా రావుకు రాష్ట్రస్థాయి స్టార్ ఈఎంటీ అవార్డు దక్కింది. అత్యవసర పరిస్థితుల్లో పలువురి ప్రాణాలను కాపాడటంలో అత్యుత్తమ సేవలందించినందుకు రామారావుకు రాష్ట్రస్థాయి స్టార్ ఈఎంటీ ప్రథమశ్రేణి అవార్డు వరించింది. ఈమేరకు అవార్డును శుక్రవారం తల్లాడలోని 108 కార్యాలయంలో జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్ రామారావుకు ప్రదానం చేశారు. రాష్ట్రస్థాయి ప్రథమశ్రేణి ఈఎంటీ అవార్డు తల్లాడకు దక్కడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో 108సిబ్బంది టి.కృష్ణ, ఎం.నర్సింహారావు, ఏ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ఈఎంటీ అవార్డును స్వీకరిస్తున్న రామారావు

పామాయిల్ తోటలను పరిశీలించిన
శాస్త్రవేత్తలు, అధికారులు

దమ్మపేట, జూన్ 21: దమ్మపేట మండలంలోని ఆకినేపల్లి, దమ్మపేట పరిధిలోని పామాయిల్ తోటలను, అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరిని శుక్రవారం జాతీయ బయోడైవర్సిటి టెక్నికల్ కమిటి చైర్మన్ సి అచెలేందర్ ఐఎఫ్ఎస్, ఆంధ్రప్రదేశ్ బయోడైవ ర్సిటీ చైర్మన్ జయరాజు ఐఎఫ్ఎస్, ఐఐఓపీఆర్ పెదవేగి సీనియర్ శాస్త్రవేత్త డా.ఎంవీ ప్రసాద్ పరిశీలించారు. వీరు తోటలను పరిశీలించి రైతులు పొందుతున్న రాయతీలు, సాగు విధానం, పామాయిల్ సాగుతో జరిగిన అభివృద్ధి, లాభాలు తదిర అంశాలను, అంతర పంటల సాగు విధానాలను జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి సూర్యనారాయణ వివరించారు. ఆయిల్‌పాం, అడ్వైజరికమిటి సభ్యులు, పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అధికారులకు, శాస్త్రవేత్తలకు పామాయిల్ సమస్యలు, తెగుళ్లు, రైతుల ఇబ్బందులు వివరించి సమస్యలు పరిష్కరించేందుకు సహకరిచాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో ఉద్యానవన అధికారి సందీప్, ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట డివిజనల్ అధికారి బాలకృష్ణ, రాజశేకర్‌రెడ్డి వున్నారు.



పామాయిల్ తోటలు పరిశీలిస్తున్న అధికారులు

నాగలి పట్టి.. దుక్కి దున్ని..

- ఏరువాకలో పాల్గొన్న సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, జూన్ 21: ఏరువాక పున్నమి సందర్భంగా మండలంలోని బేతుపల్లి శివారులోని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంటపొలంలోకి దిగి నాగలి పట్టి దుక్కిదున్ని ట్రాక్టర్ నడిపారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రమంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్వతహాగా రైతు కావడంతో వారికి కావాల్సిన అవసరాలను గుర్తించి వ్యవసాయాభివృద్ధి కృషి చేస్తున్నారన్నారు. రైతువేదికల వద్ద ఆధునిక వ్యవసాయ పద్ధతులను వివరించేందుకు ప్రతి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్‌లను నియోజకవర్గంలో మండలానికి ఒకటి చొప్పున ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. త్వరలోనే రైతు రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఉల్లోజు నరసింహారావు, ఏవో వై.శ్రీనివాసరావు, ఏఈవో ఆశాజ్యోతి, సెక్రటరీ రవితేజ, డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, చల్లగుళ్ల నరసింహారావు, గాదె చెన్నారావు, ఉడతనేని అప్పారావు, వినుకొండ కృష్ణ, పాకలపాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం, ఆనందం

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- నగరంలోని ఎస్పీ స్టేడియంలో యోగా డే

ఖమ్మం స్పోర్ట్స్, జూన్ 21: యోగాతో ఆనందం, ఆరోగ్యం ఏర్పడుతుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పేర్కొన్నారు. 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో జిల్లా క్రీడల, ఆయుష్ సంయుక్త శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యోగా వేడుకలను ఆయన జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజగోపాల్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా అందరిదని ఒక కులం, మతం, వర్గం, భాషలకు సంబంధించిన అంశం కాదని అన్నారు. ప్రతి ఒక్కరు యోగాను తమ దినచర్యలో భాగం చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు యోగాసనాల కోసం రెండు, మూడు నిమిషాలు కేటాయించుకోవాలని తక్కువ సమయంలో సైతం యోగా చేసి ఆనందంగా జీవించవచ్చని అన్నారు. 2024 సంవత్సరానికి గాను అంతర్జాతీయ యోగా దినోత్సవంను 'యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీ'గా చెప్పడం జరిగింది కాబట్టి ప్రతి ఒక్కరు ఈ రోజు నుంచితప్పకుండా యోగా కోసం కొంత సమయాన్ని కేటాయించుకోవాలని అన్నారు. అనంతరం ఔత్సాహికులతో కలిసి యోగాసనాల కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, యోగా గురువు డాక్టర్ రామచందర్‌రావు, డాక్టర్ రవికుమార్, అర్బన్ తహసీల్దార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కొత్త సర్క్యులర్‌తో లాభం ఎవరికి..?

- సాయంత్రం 5గంటల్లోపు ఇంటి దారిపడుతున్న ఉద్యోగులు

రుద్రంపూర్, (సింగరేణి) జూన్ 21: సింగరేణి ప్రధాన కార్యాలయంలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు సమయం పాటించాలంటూ సింగరేణి యాజమాన్యం విడుదల చేసిన సర్క్యులర్ వల్ల కొత్త చిక్కులు ఏర్పడే అవకాశాలు కనిపిస్తోన్నాయి. సింగరేణి ప్రధాన కార్యాలయంలో పని చేసే ఉద్యోగులు ఉదయం 9.30గంటలకు విధులకు హాజరుకావాల్సి ఉండగా పది నిమిషాల గ్రేస్ సమయాన్ని కేటాయించారు. మధ్యాహ్నం భోజన సమయం ఒంటిగంట నుంచి 1.30గంటల వరకు ఉండగా మరో పది నిమిషాలు గ్రేస్ సమయంలో విధులకు హాజరుకావాలని నిబంధనలు పెట్టారు. ఈ సర్క్యుల ర్ గురువారం నుంచి అమలు కావడంతో ఉద్యోగులంతా సాయంత్రం 5గంట లకు ఇంటిదారి పడుతున్నారు. దీంతో కీలక విభాగాల్లో ఉన్నతాధికారులు ఎక్కువ సమయం ఉండటం వల్ల కిందిస్థాయి ఉద్యోగులు 5గంటలకే విధుల నుంచి వెళ్లిపోవడం వల్ల పనులు ముందుకు సాగే పరిస్థితి కనిపించడం లేదని పలువురు ఉన్నతాధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది సిబ్బంది సకాలంలో విధులకు హాజరుకావడం లేదనే వస్తున్న విమర్శలను నిలిపివేసేందుకు యాజమాన్యం కొత్త సర్క్యులర్‌ను విడుదల చేసింది. దీంతో ఆ సర్క్యులర్ వల్ల కొత్త సమస్యలు ఏర్పడే పరిస్థితి నెలకొంటుంది. ఉదయం 9.40గంటలు దాటి విధులకు హాజరయ్యే ఉద్యోగులు, కార్మికుల వివరాలను సెక్యూరిటీ సిబ్బంది నమోదు చేస్తుండటంతో ఉద్యోగులు ముందుగానే విధులకు హాజరవుతున్నారు. దీంతో సమయం మేము సైతం పాటిస్తామని సాయంత్రం 5గంటలకే కార్మికులు ఇంటిదారి పడుతుండటంతో పరిపాలన వ్యవస్థ కుంటుపడే అవకాశాల ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఏదిఏమైన విధులకు హాజరయ్యే సమయాన్ని సేకరిస్తున్న సెక్యూరిటి సిబ్బంది అదనపు పనులు చేస్తున్న ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనం చేకూరుస్తారని పలువురు యాజమాన్యాన్ని ప్రశ్నిస్తున్నారు.



సాయంత్రం 5గంటలకు విధుల నుంచి ఇంటి దారిపడుతున్న ఉద్యోగులు

జీఎం కార్యాలయం పని వేళలపై అధికారుల నిఘా

మణుగూరుటౌన్: సింగరేణి సీఎండీ బలరాంనాయక్ ఆదేశాలతో మణుగూరు ఏరియా జీఎం కార్యాలయ ఉద్యోగుల విధుల హాజరు, పనివేళలపై ఆడిటింగ్ అధికారులు నిఘా వేశారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయాన్నే మణుగూరుకు వచ్చిన అకౌంట్స్ ఆఫీసర్ రమేష్, సిబ్బంది ఆధ్వర్యంలో జీఎం కార్యాలయంలో తిష్ట వేశారు. కార్యాలయం సిబ్బంది తమ విధులకు వచ్చే సమయాన్ని పరిశీలించారు. ఉదయం 9 గంటలకు సరైన సమయం కాగా 10 నిమిషాల గ్రేస్ పీరియడ్ తర్వాత ఎంతమంది ఉద్యోగులు విధులకు హాజరవుతున్నారు.. టీ బ్రేక్, లంచ్ బ్రేక్‌ల పేరుతో ఎంత మంది ఉద్యోగులు సమయాన్ని వృథా చేస్తున్నారో పరిశీలించారు. కాగా శుక్రవారం జీఎం కార్యాలయంలో సమారు 150 మందికి పైగా వివిధ హోదాల్లో ఉద్యోగులు విధులు నిర్వహిస్తుండగా.. అందులో సుమారు ముప్పై మందికి పైగా గ్రేస్ సమయం ముగిసిన తర్వాత రెండు నిమిషాలు మొదలుకుని అరగంట ఆలస్యంగా హాజరైన ఉద్యోగులను గుర్తించారు. వీరికి తొలిసారి పొరపాటుగా గుర్తించి మందలించి వదిలి వేయనున్నట్లు తెలిసింది. మరో సారి ఇలా జరిగితే శాఖపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని డీజీఎం పర్సనల్ ఎస్ రమేష్ తెలిపారు.

కోనోకార్పస్ చెట్ల కథ కంచికి..

- నగర పరిధిలో 4వేల చెట్ల తొలగింపు
- నాడు వద్దన్నా నాటిన కేఎంసీ అధికారులు
- లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం



మొక్కలు తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

ఖమ్మం కార్పొరేషన్, జూన్ 21: కోనోకార్పస్ మొక్కల వల్ల మనుషులకు శ్వాసకోస వ్యాధులు వస్తాయని, వాటిని నాటవద్దని నిపుణులు మొత్తుకున్నా.. ఖమ్మం నగరపాలక సంస్థ అధికారులు పెడచెవిన పెట్టారు. గతంలో చేపట్టిన హరితహారం కార్యక్రమంలో నగర పరిధిలోని వివిధ డివిజన్లలో ఏకంగా సుమారు 5 వేల మొక్కలను నాటారు. అవి ఏపుగా పెరిగి చెట్లుగా మారాయి. అయితే కోనోకార్పస్ చెట్ల వల్ల మనుషుల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతుండటంతో వాటిని నిషేధిత మొక్కల జాబితాలోకి చేర్చారు. అవి ఎక్కడ వున్నా వెంటనే తొలగించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాల రావడంతో నగర పాలక సంస్థ అధికారులు రంగంలోకి దిగి తొలగింపు చర్యలు చేపట్టారు. ఇప్పటికి సుమారు 4వేల మొక్కలను తొలగించగా, ఇంకా సుమారు వెయ్యి మొక్కలను తొలగించాల్సిఉంది. హరితహారం కింద ఒక్కో మొక్కకు రూ.30నుండి రూ.50 చెల్లించి కొనుగోలు చేశారు. ప్రస్తుతం సదరు మొక్కలను తొలగించటంతో లక్షలాది రూపాయల నిధులు వృధా అయ్యాయి. ఒంటెత్తుపోకడలతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించాలి

● కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించిన వీర్వోల సంఘం నాయకులు

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 21: జీవో నెంబర్.121 ద్వారా తెలంగాణ గ్రామ రెవెన్యూ అధికార వ్యవస్థ రద్దు చేసిన చట్టాన్ని పునఃపరిశీలించి దాన్ని పునరుద్ధరించాలని గ్రామరెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర నాయకులు గరికె ఉపేంద్రరావు కోరారు. శుక్రవారం ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను ఆయన కలిశారు. ఆర్థిక శాఖ పూర్వ వీఆర్వోలను 'రీ డెప్లాయిమెంట్' పేరుతో 'లాటరీ విధానం'లో ఏకపక్షంగా రెవెన్యూ శాఖ నుంచి తప్పించి, వేర్వేరు శాఖలకు బదిలీ చేయడంతో ఉద్యోగుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొటుంన్నారన్నారు. ఫలితంగా 010 పదు, ఐఎఫ్ఎంఐఎస్ ద్వారా జీతాలను పొందడం లేదన్నారు. మా వేతనం నుంచి జీపీఎఫ్, సీపీఎస్, టీఎస్‌జీఎల్ఐ చందా చెల్లింపులు నిలిచిపోయాయన్నారు. వీఆర్వోల సమస్యలపై తెలంగాణ ప్రభుత్వం దృష్టికి నివేదించి, పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బంక కృష్ణ, షేక్ జానిమియా, వాంకుడు వెంకన్న, ధరావత్ భాస్కర్, రాజారత్నం, రాంబాబు, ఆంగోతు ఉపేందర్, షేక్ సైదులు తదితరులున్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న వీఆర్వోల సంఘం నాయకుడు ఉపేంద్రరావు

గంజాయి గుప్పు.. పోలీస్ లుక్కు..

(3వ పేజీ తరువాయి)

ఇరు రాష్ట్రాలు పట్టుబిగిస్తే...

ఇరు రాష్ట్రాలు గంజాయి అక్రమ రవాణాకు పట్టు బిగిస్తే గంజాయి స్మగ్లర్ల ఆటకట్టువచ్చనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి గంజాయి స్మగ్లర్లపై ఉక్కుపాదం మోపాలని ప్రత్యేక ఆదేశాలు జారీ చేసిన క్రమంలో తాజాగా ఏపీ హోం శాఖ మంత్రి అనిత సైతం గంజాయి రవాణాను పూర్తిగా నియంత్రించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ప్రకటించారు ఈ నేపథ్యంలో ఇరు రాష్ట్రాల పోలీసు, ఎక్సైజు అధికారులు పరస్పర సహకారం, సమన్వయంతో తనిఖీలు నిర్వహిస్తే గంజాయి స్మగర్ల ఆటకట్టే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భద్రాద్రి ఏజెన్సీవాసులు పేర్కొంటున్నారు. ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు సైతం ఇందుకు సంయుక్త కార్యాచరణ ప్రణాళికను రూపొందించి గంజాయి స్మగర్లకు చెక్ పెడితే యువత దుర్వసనాలకు దూరమయ్యే అవకాశాలున్నాయని ఏజెన్సీ వాసులు పేర్కొంటున్నారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం: ఖమ్మం సీపీ

ఖమ్మం క్రైం, జూన్ 21: గంజాయి రవాణా కట్టడికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని ఖమ్మం పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ఆదేశించారు. మాదకద్రవ్యాలు, గంజాయి సరఫరా, చట్టవ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలు, పెండింగ్ గంజాయి కేసులపై జిల్లా పోలీసు యంత్రాంగంతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడు తూ సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, విస్తృతంగా వాహ నాలు తనిఖీ చేయడం ద్వారా గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చని తెలిపారు. రైలు, రోడ్డు రవాణా మార్గాలున్న సరిహద్దు రాష్ట్రాల నుండి జిల్లా మీదుగా ఇతర రాష్ట్రాలకు గంజాయి తరలించే అవకాశం ఉన్నందున స్థానిక పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్ బృందాలు దృష్టిసారించాలని, స్మగ్లర్లపై పీడీ యాక్టు నమోదు చేయాలని సూచించారు. 'కొందరు స్మగ్లర్లు గంజాయి అందించేందుకు పాన్ డబ్బాలను అడ్డాలుగా మార్చుకుంటున్నట్టు సమాచారం ఉంది.. అందువల్ల ఆయా అడ్డాల్లో నిఘా పెట్టాలి.. అలాగే పట్టణ శివార్లపై దృష్టిసారించి గంజాయి బానిసలను అదుపులోకి తీసుకోవాలి..' అని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్‌బీ ఏసీపీ ప్రసన్నకుమార్, సీఐలు స్వామి, రామకృష్ణ పాల్గొన్నారు.



నాణ్యమైన విత్తనాలు అందించాలి

» కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



విత్తన దుకాణ యజమానులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంవ్యవసాయం, జూన్21: రైతులకు డీలర్లు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. షాపుల్లో ఉన్న విత్తనాలు, ఎరువులు వివరాలను పరిశీలించారు. ఎరువులు, విత్తనాల అమ్మకాలకు తగిన అనుమతులు పొందిన పత్రాలను పరిశీలించి దుకాణదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు సంబంధించిన బిల్లులు ఖాళీ ప్యాక్‌లు పంట సీజన్ పూర్తయ్యేవరకు భద్ర పరుచుకునేలా అవగాహన కలిపించాలని తెలిపారు. రైతులు ఏ ప్రాంతాల నుంచి వస్తుంది ఏఏ రకాల అడుగుతుంది అడిగి తెలుసుకన్నారు. జిల్లాలో రైతులు ఏఏ కూరగాయలు పండిస్తారు, పూలసాగుచేస్తున్నారా, ఏ విత్తనాలు ఎక్కువగా అడుగుతుంది, మార్కెటింగ్ ఎక్కడ చేస్తారనే విషయాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సాగులో సక్సెస్ అయిన రైతు అనుభవాలను ఇతర రైతులకు అవగాహన కలిపించాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయాధికారులు తనిఖీలను షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా చేయాలని కోరారు. రైతులు ప్యాక్‌చేసిన విత్తనాలు మాత్రమే కొనాలని, ఈతనిఖీల్లో జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల, సహాయ సంచాలకులు ఎ.శ్రీనివాసరావు, ఖమ్మం అర్బన్ మండల వ్యవసాయాధికారి కిషోర్‌బాబు తదితరులున్నారు.

'జయశంకర్ ఆశయాలు సాధించాలి'



బీఆర్ఎస్ కార్యాలయంలో జయశంకర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మంకార్పొరేషన్, జూన్21: తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్ ఆశయాలు సాధించాలని పలువురు బీఆర్ఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విగ్రహానికి బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, సీనియర్ నాయకులు గుండాల కృష్ణ, ఉద్యమకారుడు ఉప్పల వెంకట రమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు దశాబ్దాలుగా తెలంగాణా సాధనే శ్వాసగా చేసుకొని ఉద్యమకారులకు ప్రేరణగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

ఖమ్మం లీగల్: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా బార్ అసోసియేషన్ హాల్లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాదులు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య

మణుగూరు, జూన్ 21: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మునిసిపాలిటీ పరిధిలోని శివలింగాపురం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శివలింగాపురం గ్రామానికి చెందిన తాలూరి సాయి కిరణ్(27)డిస్ ఫిట్టింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కాగా శుక్రవారం భార్య భర్తల మధ్య జరిగిన కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు అపస్మారకస్థితిలో ఉన్న అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం భద్రాచలం ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృత దేహాన్ని భద్రాచలం నుంచి మణుగూరు తరలించి ఏరియా ఆసుపత్రి మార్చురీలో ఉంచారు.

అనారోగ్యకారణాలతో వ్యక్తి...

వైరా, జూన్ 21: అనారోగ్యకారణాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వైరా మునిసిపాలిటీలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైరా మునిసిపాలిటీలో ఏడోవార్డు పరిధిలోని బ్రాహ్మణపల్లిలో అగ్రహారానికి చెందిన జన్ను అశోక్ (30) రోడ్ల వెంట తినుబండారులు విక్రయించే వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో మద్యం వంటి వ్యసనాలకు గురై అనారోగ్యం భారీనపడ్డాడు. దీంతో మనస్తాపం చెందిన అతడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. వైరా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలెక్కబోయి వ్యక్తి మృతి

● కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో ఘటన

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్21: రైలెక్కబోయి ప్రమాదవశాత్తూ కాలుజారి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. జీఆర్పీ ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం..కొత్తగూడెం రైల్వే స్టేషన్ ప్రాంగణంలోని ప్లాట్ ఫాంపై నీళ్ల నిల్వ ఉండడంతో కొత్తగూడెం నుంచి హైదారాబాద్ వెళ్లేందుకు కాకతీయ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కుతున్న క్రమంలో చుంచుపల్లి మండలంలోని నందాతండకు చెందిన మేధర మహ్మద్(50) అనే వ్యక్తి జారీ కిందపడ్డాడు. తీవ్రగాయాలైన క్షతగాత్రుడిని స్థానికుల సహాయంతో కొత్తగూడెం సర్వజన ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందిస్తున్న క్రమంలో మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు హైదారాబాద్‌లో సినీ సహాయ రచయితగా పని చేస్తున్నాడు. భద్రాద్రి జిల్లా కళాకారుడు మృతి చెందడంతో అభ్యుదయ కళా సేవా సమితి బృందం ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు...

తల్లాడ, జూన్ 21: గేదెను బైక్ ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని అన్నారుగూడెం సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోనకల్ మండలం కలకోట గ్రామానికి చెందిన తోటపల్లి జార్జి(30) తల్లాడ నుంచి అన్నారుగూడెం వైపు ద్వి చక్ర వాహనంపై వెళ్తుండగా రోడ్డుపై ఉన్న గేదెను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు.

హత్య కేసులో నిందితుడు....

నేలకొండపల్లి, జూన్21: హత్య కేసులో నిందితుడైన శొంఠి శ్రీను వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. వివరాల ప్రకారం.. భైరవునిపల్లి గ్రామానికి చెందిన బూర సైదమ్మ(51)ను ఈనెల 7న అదే గ్రామానికి చెందిన శొంఠి శ్రీను కత్తితో హత్య చేసిన విషయం విధితమే. అనంతరం శ్రీను సైతం అదే కత్తితో పొడుచుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. అప్పటి నుంచి వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు సమాచారం.

120 నాటుసారా ప్యాకెట్ల పట్టివేత

● నరసాపురంలో ఘటన

దుమ్ముగూడెం, జూన్ 21: నరసాపురం ఎస్సీ కాలనీ మహిళలు శుక్రవారం 120 ప్యాకెట్ల నాటుసారాను పట్టుకున్నారు. అదే కాలనీలో ఉంటున్న కొందరు వ్యక్తులు కొన్నేళ్లుగా సరిహద్దు ఏపీ రాష్ట్రం కన్నాయిగూడెం నుంచి నాటుసారా తెచ్చి నరసాపురం ఎస్సీ కాలనీలో విక్రయిస్తున్నారు. వారిలో ఒకరు శుక్రవారం సారా ప్యాకెట్లను తెస్తూ స్థానిక మహిళల కంట పడ్డాడు. మహిళలు అతడిని వెంబడించి పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి నాటుసారా ప్యాకెట్లను స్వాధీన పర్చుకున్నారు. నాటుసారా రవాణా చేస్తున్న వ్యక్తి పరారవడంతో పట్టుబడిన నాటుసారా ప్యాకెట్లను మహిళలు పోలీస్‌స్టేషన్‌కు స్వాధీన పర్చారు.

వాయుస్తంభన విద్యతో అబ్బురపర్చిన స్విమ్మర్



చేతుల్లో దీపాలు వెలిగించి వాయుస్తంభన విద్య ప్రదర్శిస్తున్న సత్యనారాయణ

మధిర, జూన్ 21: ట్యాంక్ బండ్ చెరువులో వాయి స్తంభన విద్యఉపయోగించి సీనియర్ స్విమ్మర్ చల్లా సత్యనారాయణ నీటిలో వెల్లకిలా పడుకొని రెండు చేతుల్లో దీపాలు వెలిగించి చలనం లేకుండా నీటిలో పడుకొని అబ్బురపర్చారు. ఇది తాను ఎంతో కాలం సాధన చేయడం ద్వారా సాధించానని ఆయన తెలిపారు. చల్లా సత్యనారాయణ ప్రదర్శన పలువురికి ఎంతకానో ఆకట్టుకుంది..

నూతన బొగ్గు గనులతోనే....

సింగరేణికి మనుగడ



» వేలంలో పాల్గొనకుంటే ముప్పు తప్పదు » కేంద్ర ప్రభుత్వం బేషరతుగా కేటాయించాలంటున్న రాష్ట్ర ప్రభుత్వం

ఇల్లెందు, జూన్ 21: తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ రంగసంస్థలకే తలమానికంగా నిలుస్తున్న సింగరేణి కాలరీస్ దశాబ్ద కాలంగా తీవ్ర సంకట స్థితిని ఎదుర్కొంటుంది. కార్మికులు, అధికారులు సమన్వయంతో రేయింబవళ్లు చెమటోడ్చి సాధించిన కోట్లాది రూపాయల లాభాలను గత ప్రభుత్వం వివిధ ప్రభుత్వ పథకాలకు మళ్లించుకోవడంతో పాటు నూతన బొగ్గు గనుల ఏర్పాటులో సంకుచిత రాజకీయ వైఖరులు అవలంభించడంతో సింగరేణి మనుగడకే ముప్పు ఏర్పడింది.

కేంద్ర ప్రభుత్వం జాతీయ బొగ్గు గనుల కెటాయింపు విధానాల్లో భాగంగా పదో పర్యాయం హైదరాబాద్‌లో బొగ్గు గనుల వేలం ప్రక్రియను శుక్రవారం ప్రారంభించింది. కేంద్ర బొగ్గు గనుల శాఖామంత్రి జి.కిషన్‌రెడ్డి వేలం ప్రక్రియను ప్రారంభించడం గమనార్హం. బొగ్గు గనుల వేలం ప్రక్రియలు గతంలో తొమ్మిది పర్యాయాలు ఢిల్లీ, కలకత్తా తదితర ప్రాంతాల్లో జరగడం సింగరేణికి సంబంధించిన నాలుగు బొగ్గు బ్లాకులు శ్రావణపల్లి, కోయగూడెం-3బ్లాకు, సత్తుపల్లి ఓసీ-3బ్లాకు, కల్యాణఖని నాలుగు బ్లాకులను సైతం టెండర్ల ప్రక్రియలో చేర్చడం జరిగింది.

సింగరేణి కాలరీస్‌కు చెందిన రూ.86కోట్ల వ్యయంతో పరిశోధనలు సాగించి కార్మికులు బొగ్గు ఉత్పాదనకు సింగరేణి సిద్ధం చేసిన నాలుగు గనులను కేంద్ర ప్రభుత్వం టెండర్ల ప్రక్రియలో చేర్చినప్పటికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం నోరుమెదపలేదు. పైగా కేంద్రప్రభుత్వ బొగ్గు గనుల కేటాయింపు విధానపరనిర్ణయాల మూలంగా బొగ్గు గనుల వేలంలో పాల్గొనేందుకు గతంలో సింగరేణి కాలరీస్ సిద్ధ పడినప్పటికీ గత ప్రభుత్వ పెద్దలు తిరస్కరించారు. సింగరేణి కాలరీస్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశంలో సైతం బొగ్గు గనుల వేలంలో పాల్గొనాలని తీర్మానించినప్పటికీ రూ.25లక్షలు వ్యయంతో టెండర్ ఫారాలు సైతం కొనుగోలు చేసి సింగరేణి యాజమాన్యం టెండర్లు దాఖలు చేసేందుకు యత్నించినప్పటికీ గత ప్రభుత్వం పెద్దలు ఆదేశించడంతో మిన్నకుండిపోయారు. ఫలితంగా గతంలో జరిగిన బొగ్గు గనుల వేలంలోనే సత్తుపల్లి, కోయగూడెం బొగ్గు బ్లాకులకు ప్రయివేటు సంస్థలు టెండర్లు దాఖలు చేయడం, కేంద్ర ప్రభుత్వం కేటాయింపులు జరపడం తెలిసిందే.

అయితే గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన వైఖరుల మూలంగా సింగరేణి కాలరీస్ మరికొద్ది సంవత్సరాల్లో తీవ్ర సంక్షోభానికి గురికావాల్సి ఉంటుందని నూతనంగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండతో, సింగరేణి పరిధిలోని బొగ్గు గనులను సింగరేణికే భేషరతుగా కెటాయించాలని పట్టుపడుతోంది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బొగ్గు గనుల వేలంలో పాల్గొనడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరడం ద్వారా సింగరేణిలో నూతన గనుల ఏర్పాటుకు వేలంతో సంబంధం లేకుండా ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నట్లు కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

బొగ్గు గనుల వేలం...

దేశవ్యాపితంగా మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో 218 బొగ్గు బ్లాకులు నేమినేషన్ పద్ధతిలో కేటాయింపులు జరిపారు. ముందుగా దరఖాస్తు చేసిన వారికి ప్రవేటు వ్యక్తులు, సంస్థలకు నామినేషన్ పద్ధతిలో బొగ్గు బ్లాకులు కేటాయించడం వలన రూ1.86లక్షల కోట్ల కుంబకోణం జరిగిందంటూ అప్పట్లో కాగ్ నివేదిక తప్పుపట్టింది. పెద్దఎత్తున బొగ్గు గనుల కెటాయింపులో అక్రమాలు జరిగాయంటూ వెల్లడించడంతో సుప్రీంకోర్టులో విచారణసైతం జరిగింది. అప్పటి బొగ్గు శాఖా మంత్రి దాసరి నారాయణరావు ఆరోపణలకు గురయ్యారు. ఈ క్రమంలో 2014 ఆగస్టు 24న సుప్రీంకోర్టు తీర్పులో 214బొగ్గు బ్లాకులు కెటాయింపుల్లో అక్రమాలు జరిగాయని నిర్ధారిస్తూ ఆ కెటాయింపులను రద్దు చేసింది. ఈ సంఘటన 2014లో బొగ్గు పరిశ్రమలో తీవ్రసంచలనం రేకెత్తించింది. ఫలితంగా కేంద్రంలో నరేంద్రమోదీ పగ్గాలు చేపట్టిన పిదప 2015జనవరిలో బొగ్గు గనులు, ఖనిజాల కేటాయింపుల చట్టానికి పార్లమెంటులో సవరణలు చేశారు.

ఈ చట్టం ప్రకారం పారదర్శకంగా గనుల కేటాయింపులు జరిపేందుకు మూడు విధానాలు అనుసరించింది. క్యాప్టివ్‌మైన్స్, వేలంద్వారా, నామినేషన్ పద్ధతి ద్వారా గనుల కేటాయింపులు జరిపేందుకు చట్టసవరణ చేశారు. అయితే నామినేషన్ పద్ధతి ద్వారా బొగ్గు బ్లాకుల కెటాయింపు విధానాన్ని పలురాష్ట్రాల ప్రభుత్వాలు సద్వినియోగం చేసుకొన్నాయి. కోల్‌ఇండియా ప్రభుత్వ రంగ సంస్థ 116 బొగ్గు బ్లాకులను సైతం నామినేషన్ విధానంలో తీసుకోవడం గమనార్హం. కాని తెలంగాణ ప్రభుత్వం మాత్రం సింగరేణి కాలరీస్ పరిధిలో ఏర్పాటు కాబడిన నాలుగు బొగ్గు బ్లాకులను సైతం సింగరేణికి కెటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరకపోవడం మూలంగా సింగరేణి తీవ్రంగా నష్టపోయింది. తుదకు బొగ్గు గనుల వేలంలో సైతం సింగరేణిని పాల్గొనకుండా అడ్డుచెప్పడం మూలంగా సింగరేణిలో నూతన గనుల ఏర్పాటుకు అవకాశాలు లేకుండా పోయాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం మరో పదేళ్ల వరకు సరిపోయే బొగ్గు నిల్వలు 1200మిలియన్ టన్నులు మాత్రమే ఉన్నాయని 10సంవత్సరాల పిదప సింగరేణి నూతన గనులు లేక తీవ్ర సంక్షోభానికి గురికావాల్సి ఉంటుందని భావిస్తున్నారు.

సింగరేణిలో మోగుతున్న ప్రమాదగంటికలు, కార్మికులు, ఉద్యోగుల భవిష్యత్‌తో పాటు తెలంగాణ భవిష్యత్ కూడా ఆధారపడి ఉందనడం అతిశయోక్తికాదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం బొగ్గు గనుల వేలం నుంచి సింగరేణి పరిధిలోని గనులను భేషరుతుగా కేటాయించాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టుపడుతుండటం పట్ల కార్మిక వర్గం హర్షం వ్యక్తంచేస్తుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని సింగరేణికి నూతన బొగ్గు గనులను నామినేషన్ పద్ధతిలో కేటాయించాలని కోరడంతో పాటు జరుగుతున్న బొగ్గు గనుల వేలంలో సైతం సింగరేణి యాజమాన్యం పాల్గొనడం సింగరేణికి శ్రేయస్కరమని కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

● కలెక్టర్ జితేష్ వి. పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్

కొత్తగూడెం, జూన్ 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మరమ్మతు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు చేయించే విధానంపై శుక్రవారం ఐడీవోసీ కార్యాలయం సమావేశ మందిరంలో డీఆర్‌డీవో విద్యచందనతో కలిసి నీటిపారుదల, పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ, మున్సిపల్, పీఎస్‌ఈడబ్ల్యుఐడీసీ, ఈఈలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 697 పాఠశాలల్లో పనులు చేసే విధానంపై ఇంజనీర్లకు పలు సూచనలు చేశారు. పాఠశాలలు తాగునీరు, మిషన్ భగీరథ నీటిని అందించకుండ పాఠశాల ఆవరణలో కానీ తరగతిలో కానీ స్టీల్ ట్యాంక్ ఏర్పాటు చేసి దానికి సెడ్మెంట్ ఫిల్టర్ బిగించవల్సిందిగా ఆదేశించారు. దీని వల్ల విద్యార్థులకు స్వచ్ఛమైన నీరు అంది వర్షాకాలంలో వచ్చే ఎటువంటి వ్యాధులనైన నివారించవచ్చని తెలిపారు. ఎలక్ట్రికల్ పనులకు సంబంధించి వైరింగ్, ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు బిగించాల్సిందిగా, వైరింగ్ మొత్తం క్రమపద్ధతిలో చేయించవల్సిందిగా కోరారు. మరుగుదొడ్ల విషయం గదిలోపల టైల్స్ వాడరాదని కాంక్రీట్‌ఫ్లోరింగ్ చేయించి రెడ్‌క్సైడ్‌తో పెయింట్ వేయాలని దీని వల్ల ఖర్చు తక్కువ అవుతుందని పిల్లలు జారిపడే అవకాశం కూడా ఉండదని తెలిపారు. మే 31 లోగా మంజూరైన ప్రతి పని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి పని ప్రారంభించే ముందు పూర్తి అయిన తర్వాత ఫొటోస్ అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాతీయ బ్యాం కుల్లో కమిటీల ఖాతాలు తెరిపించాలన్నారు. ప్రతిరోజు పనుల పురోగతిపై నివేదికలు అందచేయాలన్నారు. రానున్న రోజుల్లో గాలిదుమ్ములు వచ్చే అవకాశం ఉందని మున్సిపల్ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకుని రోడ్లు శుభ్రంగా ఉండేవిధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్, ఆర్‌అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, విద్యాశాఖాధికారి వెంకటేశ్వర చారి, ఆర్‌అండ్‌బీ ఈ. నాగేశ్వరరావు, మున్సిపల్ డీఈ రవికుమార్, ట్రైబల్ వెఎల్ఫర్ డీఈ, మెప్మా పీడీ రాజేష్,డీపీఎం సెర్ప్ నాగజ్యోతి, రంగారావు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, డీఈలు, ఏఈలు, ఎపీఎంలు, వీవో అధ్యక్షురాలు, మండల సమాఖ్య ప్రెసిడెంట్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యూత్ అథ్లెటిక్స్

కాంస్య పతక విజేతకు అభినందన



శ్రీతేజను అభినందిస్తున్న కలెక్టర్ జితేష్ విపాటిల్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూన్ 21: జాతీ య యూత్ అథ్లెటిక్స్ కాంస్య పతకం విజేత శ్రీతేజను కలెక్టర్ జితేష్ వి పాటిల్ అభినందించారు. శుక్రవారం ఐడీవోసీ లోని కార్యాలయంలో కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా క్రీడాకారిణి శ్రీతేజ కలిశారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ముగిసిన జాతీయ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో జిల్లాలో కరకగూడెం మండలానికి చెందిన తోలెం శ్రీతేజ హెప్టాత్లోన్ ఈవెంట్ విభాగంలో తెలంగాణ రాష్ట్రం తరుపున పాల్గొని 4,136 పాయింట్లు సాధించి జాతీయ స్థాయిలో తృతీయ స్థానాన్ని సాధించింది. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తాను అథ్లెటిక్స్ ఢిల్లీలో ప్రాక్టీస్ చేశానని, 400 మీటర్స్ పరుగు పందెం 53 సెకన్‌లో పూర్తి చేశానని తన స్మృతులను తెలిపారు. అథ్లెటిక్స్‌లో ప్రాక్టీస్ చేసి రాబోయే రోజుల్లో అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా క్రీడల అధికారి కె.సంజీవరావును శ్రీతేజకు అథ్లెటిక్స్ షూస్ అందజేయాల్సిందిగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోచ్ పి.నాగేందర్‌ను, అథ్లెటిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహిధర్, కార్యాలయ సూపరింటెండెంట్ ఉదయ్‌కుమార్, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

228 కేజీల గంజాయి పట్టివేత

» సినీఫక్కీలో వెంటాడిన ఎక్సైజ్ అధికారులు

» పట్టుబడిన గంజాయి విలువ రూ.60లక్షలు



దుమ్ముగూడెం: నిందితులను చూపుతున్న అధికారులు

దుమ్ముగూడెం, జూన్ 21: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సినీ ఫక్కీలో 25 కిలోమీటర్లు వెంటాడిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కారులో అక్రమంగా రవాణా అవుతున్న సుమారు రూ.60లక్షల గంజాయిని శుక్రవారం పట్టుకున్నారు. సరిహద్దు ఏపీ నుంచి ఒక కారు గంజాయి ప్యాకెట్లతో భద్రాచలం వైపుగా వస్తోందని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాసరావుకు ముందస్తు సమాచారం ఉంది. దీంతో సీఐ తన సిబ్బందితో కలిసి భద్రాచలంలోని కూనవరం రోడ్డులో ఈనెల 21న తెల్లవారుజామున కాపలా కాశారు. భద్రాచలం వంతెన సమీప చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేసి పట్టుకోవాలనే ప్రణాళికతో కొంతమంది సిబ్బందిని అక్కడ ఉంచారు. కూనవరం రోడ్డులో వారి కళ్ల ముందుగా తమిళనాడు రిజిస్ట్రేషన్‌కు చెందిన ఒక కారు వేగంగా వెళ్లడంతో దాన్ని వెంబడించారు. వెనుకగా అధికారులు తరుముతుండడాన్ని గమనించిన స్మగ్లర్లు తమ కారును భద్రాచలం వంతెన వైపు కాకుండా చర్ల వైపునకు మళ్లించారు. వేగంగా వెళుతున్న స్మగ్లర్ల కారును ఆపాలనే ఉద్దేశంతో దుమ్ముగూడెం ఎస్ఐ కేశవరావు సహకారంతో లక్ష్మీనగరం ఎస్బీఐ వద్ద ప్రధాన రహదారికి అడ్డుగా ద్విచక్రవాహనాలను పెట్టించారు. దీంతో ఆ కారు లక్ష్మీనగరం వద్ద ఆగడంతో అప్రమత్తమైన పోలీసులు వారిని పట్టుకునేందుకు యత్నించారు. కారులో ముగ్గురు స్మగ్లర్లుండగా, వారిలో ఒక వ్యక్తి పారిపోయేందుకు ప్రయత్నించగా పోలీసు కానిస్టేబుళ్లు వెంబడించి పట్టుకున్నారు. వెనుకగా వచ్చిన ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాసరావు కారు డిక్కీను తెరిచి చూడగా, ఒక్కొక్కటి కిలో బరువుగల 228 గంజాయి ప్యాకెట్లున్నాయి. స్మగ్లర్లు మద్రాస్‌కు చెందిన శివగురు, కృష్ణఫర్, రాకుల్ బోస్ లుగా పోలీసులు గుర్తించారు. కాగా కారుతో సహా గంజాయిను భద్రాచలం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుల వద్ద శ్రీలంక, బంగ్లాదేశ్ కరెన్సీ కూడా లభించింది. సినీఫక్కీలో జరిగిన ఈ ఉదంతాన్ని స్థానికులు దగ్గర నుంచి చూడడంతో ఒకింత సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు.

మణుగూరు లో14 కేజీల గంజాయి...



మణుగూరుటౌన్: గంజాయిని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

మణుగూరుటౌన్, జూన్ 21: మణుగూరు పట్టణంలోని సీఎస్‌పీ కాటా వద్ద శుక్రవారం మణుగూరు పోలీసులు 14 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మణుగూరు నుంచి ఏటూరునాగరం వైపుగా ఒరిస్సా రాష్ట్రం, చిత్రకొండ మల్కనగిరి జిల్లాకు చెందిన గురుకిలా, పోదువంతల్ అనే ఇద్దరు వ్యక్తులు గంజాయి రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం ఎస్ఐ మేడ ప్రసాద్ సిబ్బంది సీఎస్‌పీ కాటా వద్ద బైక్‌పై వస్తున్న వారిని ఆపి తనిఖీ చేశారు. దీంతో వారి వద్ద సుమారు 14 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని, అదుపులోకి తీసుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ.4 లక్షల మేర ఉంటుందని ఎస్ఐ తెలిపారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది రవీందర్, సనయ్ తదితరులున్నారు.

భూ వివాదం..

వ్యక్తి ఆత్మహత్య..

» పోలీస్ స్టేషన్ ముందు బంధువుల ఆందోళన

» ఐదుగురు వ్యక్తులే కారణమని కుమారుడి ఫిర్యాదు

» కొణిజర్ల మండలం మేకలకుంటలో ఉద్రిక్తత



పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్‌లో సక్రియా (ఫైల్)


కొణిజర్ల, జూన్ 21: పొరుగువారితో భూ వివాదం నేపథ్యంలో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వివాదానికి దారితీసింది. ఐదుగురు వ్యక్తుల వల్లే తమ తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడని, వారిని శిక్షించాలని మృతుడి కుమారులు, బంధువులు ఆందోళనకు దిగారు. కొద్దిసేపు ఉద్రిక్తతకు దారి తీసిన ఈ ఘటన.. కొణిజర్ల మండల పరిధిలోని మేకలకుంట గ్రామంలో శుక్రవారం జరిగింది. కుటుంబసభ్యులు, ఎస్ఐ శంకర్‌రావు తెలిపిన వివరాలు ప్రకారం... మేకలకుంట గ్రామానికి చెందిన భూక్యా సక్రియా(55) కు ముగ్గురు కుమారులు. ఆయన చిన్నకుమారుడు వద్ద ఉంటున్నారు. గురువారం రాత్రి 9 గంటల సమయంలో ఇంటివాసారుల్లోని రేకులకు ఉన్న ఇనుపపైపుకు సక్రియా చీరతో ఉరి వేసుకున్నాడు. భార్య వచ్చి చూసేసరికి విగతజీవిగా వేలాడుతుండటంతో విలపిస్తూ కుమారుడిని, స్థానికులను పిలిచింది. వారు వెంటనే వైరాలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్ళగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

ఈ క్రమంలో శుక్రవారం కుటుంబసభ్యులు, స్థానికులు కొంతమంది కలిసి పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకొని స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళన చేశారు. తమ తండ్రి ఆత్మహత్యకు భూవివాదమే కారణమని, తమ పక్క చేను యజమాని అజయ్, కౌలురైతు క్రిష్ణ మరో ముగ్గురు వలనే ఆత్మహత్య చేసుకున్నాడని, కారకులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కొంతకాలంగా సదరు వ్యక్తులు తమ భూమిపై కన్నేసి, సాగుకు ఆటంకాలు సృష్టిస్తున్నారని, భూమి తమకే అమ్మాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. వీరి వలన ప్రాణహాని ఉందని గతంలోనే పిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో మానసిక ఒత్తిడికి లోనై తమ తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. కాగా, సీఐ సాగర్ ఆందోళన వద్దకు చేరుకొని ఆత్మహత్యకు కారకులపై తమకు ఫిర్యాదు ఇస్తే, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో ఆందోళనకారులు ఆందోళనను విరమించారు.

ఈ విషయంపై ఎస్ఐ శంకర్‌రావు మాట్లాడుతూ భూవివాదంపై గతంలో వారు పిర్యాదు చేయగా, ఇరువురిని పిలిపించి కౌన్సిల్ ఇవ్వడం జరిగిందన్నారు.సివిల్ వివాదం కావడంతో రెవిన్యూవారితో మాట్లాడుకోవాలని తెలిపామన్నారు. సక్రియా మృతికి సంబంధించి అజయ్, క్రిష్ణ, బుజ్జి, మదన్, మల్లయ్య అనే వ్యక్తులపై కుమారుడు నరేష్ పిర్యాదు చేశాడని, కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు. కాగా మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు కుమారులు ఉన్నారు.

నిందితులను శిక్షించాలి...

భూవివాదంతో ఆత్మహత్య చేసుకున్న సక్రియా కుటుంబానికి న్యాయం చేయాలని, మృతికి కారణమైన వారిని శిక్షించాలని గిరిజన సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి భూక్యా వీరభద్రం కోరారు. పోలీస్‌స్టేషన్ వద్ద చేస్తున్న ఆందోళన వద్దకు చేరుకొని ఆయన మాట్లాడారు. కొంతమంది వ్యక్తుల వలన సక్రియా ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబసభ్యులు తెలుపుతున్నారని, వారిపై సమగ్ర విచారణ జరిపి కారకులను శిక్షించాలని తెలిపారు.



హాస్టల్ పునఃప్రారంభానికి ఏర్పాట్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తల్లాడ,జూన్21: మండల పరిధిలోని మల్లవరం గ్రామంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం(హాస్టల్) పునః ప్రారంభానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 17న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'సంచారజీవులకు నిలయంగా హాస్టల్' వార్తా కథనానికి అధికారులు స్పందించారు. ఈమేరకు హాస్టల్ భవనాన్ని ఏబీసీ నర్సయ్య సందర్శించారు. హాస్టల్‌ను పునఃప్రారంభించేందుకు అడ్మిషన్లు తీసుకోవాలని వార్డెన్ విష్ణును ఆదేశించారు. ఈమేరకు హాస్టల్ భవనం వద్ద ప్రవేశం కొరకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఫ్లెక్సీని ఏర్పాటుచేశారు. తల్లాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు వెళ్లి అక్కడ చదివే విద్యార్థులను హాస్టల్‌లో చేరవచ్చు.

ఘనంగా యోగా డే

ఆసనాలతో చైతన్యపరిచిన శిక్షకులు, ప్రముఖులు




తనికెళ్ల ఉన్నత పాఠశాలలో యోగా చేస్తున్న విద్యార్థులు, యోగా శిక్షకులను సన్మానిస్తున్న వాకర్స్ కమిటీ



అడవిమల్లెల పాఠశాలలో యోగా ఆకృతిలో విద్యార్థులు



ఆసనం వేస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్




యోగా అనే రెండు అక్షరాల ఆకారంలో గాంధీనగర్ విద్యార్థులు, యోగాలో పాల్గొన్న బీజేపీ నాయకులు



మధిరలో యోగా గురూజీకి సన్మానం




కాకతీయ షుగర్స్‌లో ఆసనాలు చేస్తున్న దృశ్యం, సత్తుపల్లి కోర్టులో యోగా చేస్తున్న న్యాయాధికారి శ్రీనివాస్



గురుదక్షిణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో..




భగవద్గీత పఠనంలో పతకాలు సాధించిన వారిని సన్మానిస్తున్న ఎస్ఎస్‌వై సభ్యులు, వైరా న్యూలిట్ ఫ్లవర్స్‌లో..



జిల్లా కారాగారంలో..



ఎన్టీఆర్ పార్కులో యోగా చేస్తున్న మహిళలు

లింగాల ఎగ్జిట్ మంజూరు పట్ల హర్షం

తుమ్మల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

కల్లూరు, జూన్21: వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి ఫలితంగా మండలంలోని లింగాల వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవేపై ఎగ్జిట్ మంజూరు కావటం పట్ల కల్లూరు మండల కాంగ్రెస్, టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం లింగాల ఎగ్జిట్ ప్రదేశంలో మంత్రి తుమ్మలకు కృతజ్ఞతలు తెలుపుతూ శుక్రవారం అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, టీడీపీ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్‌రావు, కాకర్ల రంగారావు, కాటంనేని బాబురావు, ఏనుగు సత్యంబాబులు మాట్లాడారు. తుమ్మల కృషితోనే ఇది సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల



తుమ్మల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, టిడిపి నాయకులు బాగం ప్రభాకర చౌదరి, పసుమర్తి మోహన్‌రావు, తోటకూర శేషగిరిరావు పాల్గొన్నారు.

విధులను సమర్థంగా నిర్వహించాలి

జిల్లా అధికారులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్, జూన్21: అధికారులు, సిబ్బంది తమ తమ విధులను సమర్థంగా నిర్వర్తించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రజలకు వ్యవస్థపై గట్టి నమ్మకం ఉందని దానికి తగినట్లు అధికారులు బాధ్యతాయుతంగా తమ విధులను నిర్వర్తించాలన్నారు. పరిపాలనలో భాగంగా పథకాల అమలు, లబ్ధి చిట్టచివరి లబ్ధిదారునికి అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫైళ్ల నిర్వహణ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులకు పర్సనల్ ఫైనాన్స్, ఇన్వెస్ట్ మెంట్ పై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు హెల్త్ క్యాంపు నిర్వహించి, అందరి హెల్త్ ప్రొఫైల్ సేకరించనున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులను సమస్యల గురించి అడిగి కావాల్సిన సామాగ్రి, చేపట్టాల్సిన చర్యలపై నివేదిక సమర్పిం చాలన్నారు. అనంతరం కలెక్టర్, భవన సముదాయం అంతా కలియతిరిగారు. వివిధ శాఖల కార్యాలయాలను పరిశీలించారు. భవన సముదాయంలో బ్యాంకు, ఏటీఎం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. మీసేవ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. అవసరాలను బట్టి కార్యాలయాల మార్పులు చేయాలన్నారు. పచ్చదనాన్ని పెంపొందించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్‌నాయక్, జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, డీఆర్డీవో సన్యాసయ్య, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఏవో అరుణ, కేర్ టేకర్ వెంకన్న పాల్గొన్నారు.

డివిజనల్ అక్కౌంట్ ఆఫీసర్ పరీక్షలకు ఏర్పాట్లు

హాస్టల్ సంక్షేమ అధికారి, డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ నోటిఫికేషన్ విడుదల చేసిందని, దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సీబీఆర్టీ (కంప్యూటర్ బేసిడ్ రిక్రూట్మెంట్ టెస్ట్) విధానం ద్వారా జూన్ 24 నుంచి జూన్29 వరకు హాస్టల్ సంక్షేమ అధికారులు, జూన్ 30 నుంచి జూలై 4 వరకు డివిజనల్ అకౌంట్స్ అధికారి పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 8పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఉదయం 10.00 నుంచి మ.12.30 వరకు, మ.2.30 నుంచి 5.00 వరకు రెండు సెషన్స్‌లో పరీక్షలు ఉంటాయన్నారు.

సీతారామ భూనిర్వాసితులకు భారీ ప్యాకేజీ ఇవ్వాలి

కలెక్టర్‌కు విన్నవించిన వైరా ఎమ్మెల్యే

వైరా,జూన్21: సీతారామ ప్రాజెక్టు ఏన్కూరు లింక్‌కెనాల్ కింద భూములు కోల్పోయిన రైతులకు సాధారణ నష్టపరిహారం కంటే భారీ ప్యాకేజీ కింద ఎక్కువ మొత్తంలో నష్టపరిహారం ఇవ్వాలని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ కలెక్టర్ ముజామిల్‌ఖాన్‌కు విన్నవించారు. శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఎస్టీ నియోజకవర్గమైన వైరా అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్నందున అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనివ్వాలని కోరుతూ పలు సమస్యలను ప్రస్తావించారు. కొణిజర్ల ఎంపీపీ గోసు మధు, వైరా మాజీ వైస్ఎంపీపీ కట్ల రంగారావు, వైరా, ఏన్కూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, స్వర్ణ నరేందర్, ఆత్మకమిటీ చైర్మన్ కోసూరి శ్రీను, నాయకులు బీడీకే.రత్నం, పగడాల మంజుల, ధార్న రాజశేఖర్, మచ్చా బుజ్జి, పుచ్చకాయల వీరభద్రం, పమ్మి అశోక్, బోళ్ల గంగారావు, కట్ల సంతోష్, రాంమ్మూర్తి నాయక్, షేక్.హుస్సేన్, ఆనందరావు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు జన్మదిన శుభాకాంక్షలు

కలెక్టర్‌కు జన్మదినం కావటంతో పలువురు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్ సహా ఎమ్మెల్యే రాందాస్ జిల్లా కలెక్టర్‌ను కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అదేసమయంలో కలెక్టర్ పుట్టిన రోజని తెలియడంతో ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

కలెక్టర్‌ను కలిసిన వైరా మునిసిపల్ కమిషనర్

వైరా, జూన్ 21: కలెక్టర్ ముజామిల్‌ఖాన్‌ను శుక్రవారం వైరా మునిసిపల్ కమిషనర్ సీహెచ్.వేణు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వైరా



కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు

మునిసిపాలిటీలోని ప్రస్తుత పరిస్థితులను కలెక్టర్‌కు కమిషనర్ వివరించారు. మునిసిపాలిటీలోని ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలను కల్పించాలని కలెక్టర్ సూచించారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ షేక్.సైదులు కూడా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

దివ్యాంగురాలికి ఆర్థిక సాయం

ఖమ్మంచర్చికాంపౌండ్,జూన్21: ఖమ్మంలోని కమాన్ బజార్‌లో 30ఏళ్లుగా టీఅమ్ముకుంటూ జీవిస్తున్న కొండ పుల్లమ్మకు దివ్యాంగురాలైన కూతురు ఉంది. ఇటీవల ఆ యువతి వివాహం నిశ్చయం కావడంతో ఖమ్మం కమాన్‌బజార్‌లోని వ్యాపారస్తులు అందరు కలిసి రూ.54,132 నగదును సేకరించారు. ఈ నగదును శుక్ర వారం 24వడివిజన్ కార్పొరేటర్ కమర్తపు మురళి చేతుల మీదుగా కొండ పుల్లమ్మకు అందించారు. ఈ కార్యక్రమంలో సీతా రాజాబాబు, కమర్తపు కిరణ్, మాధవ్, శ్రవణ్, గుర్రం కవి, ఉదారపు తారానాద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుల ఆర్థికసాయం

ఖమ్మంరూరల్: కామెర్ల వ్యాధితో బాధపడుతూ మృతి చెందిన ఓ వ్యక్తి కుటుంబానికి తోటి మిత్రులు నగదు అందజేశారు.ఖమ్మం రూరల్ మండలం జాన్‌బాద్‌తండాకు చెందిన జర్పులు జగన్ ఇటీవల మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు., కామంచిల్ గ్రామం 2033 పదోతరగతి విద్యార్థులు సీహెచ్ చంద్రశేఖర్, సంగం విజయ్, రాంబాబు, తదితరులు నగదు అందించారు. భవిష్యత్‌లో అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

జీరోబిల్లులు కోసం దరఖాస్తుల వెల్లువ

కొణిజర్ల,జూన్21:మండలంలో 200యూనిట్ల విద్యుత్‌కు సంబంధించి జీరోబిల్లులురాని వినియోగదారులు వంద లాది మంది ఉన్నారు. ఎన్నికల కోడ్ ఉండటంతో మొన్నటి వరకు దరఖాస్తులను తీసుకోలేదు. రెండు మూడు రోజుల నుంచి మండల పరిషత్ కార్యాలయంలో జీరో బిల్లుల దరఖాస్తులను, గ్యాస్‌కు సబంధించిన దరఖాస్తులను అధికారులు స్వీకరిస్తున్నారు.ఈ నేపథ్యంలో మూడురోజుల నుంచి సుమారు 200 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. దరఖాస్తుల స్వీకరణ అనేది నిరంతర ప్రక్రియ అని ప్రజలు ఆందోళన చెందవద్దని అధికారులు తెలిపారు.

ఏపీజీవీబీ బ్యాంక్ మేనేజర్ బదిలీ

ఏన్కూరు,జూన్21: తిమ్మారావుపేట ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ నేదునూరి వంశీ నల్గొండ రీజనల్ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. బదిలీపై వెళుతున్న మేనేజర్ శుక్రవారం బ్యాంకుసిబ్బంది, గ్రామస్తులు సన్మానించారు.

ఐఎన్‌టీయూసీ నగర ఉపాధ్యక్షుడిగా ఫజల్

ఖమ్మంమార్కెట్, జూన్21: ఐఎన్‌టీయూసీ నగర ఉపాధ్యక్షుడిగా ఏఎంసీ కూరగాయలన మార్కెట్ రిటైల్ వ్యాపారస్తుడు ఫజల్ నియమితులయ్యారు. శుక్రవారం సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తా శీతరాములు నియామక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో నరాల నరేష్, చిరువ్యాపారులు, హమాలీలు పలువురు ఉన్నారు.

రిక్షా కార్మికులకు సరుకులు పంపిణీ

సత్తుపల్లిరూరల్, జూన్21: వృద్ధాప్యంతో పనిచేయలేని దుస్థితిలో ఉన్న పట్టణానికి చెందిన నలుగురు రిక్షా కార్మికులకు సరుకులను అందించారు. సుధాహెర్బల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ కొనకళ్ల సుధారాణి శుక్రవారం ఆమె నివాసం వద్ద రిక్షా కార్మికులకు అందించారు.

మనోహార్ నాయుడును పరామర్శించిన ఎమ్మెల్యే రాగమయి

ఖమ్మంసంక్షేమవిభాగం,జూన్21: అనారోగ్యంతో ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రామిశెట్టి మనోహర్‌నాయుడును సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి శుక్రవారం పరామర్శించారు. ఖమ్మంలోని మనోహర్‌నాయుడు నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే రాగమయి మనోహర్ నాయుడు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. 50వ డివిజన్ కార్పొరేటర్ రాపర్తి శరత్‌కుమార్ పాల్గొన్నారు.

జయశంకర్ ఆశయాలు నెరవేర్చాలి

మధిరటౌన్,జూన్21: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రో. జయశంకర్ ఆశయాలు నెరవేరేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. శుక్రవారం మధిరలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఖమ్మంకార్పొరేషన్, జూన్21: శుక్రవారం 30,32,33,35,36,46,47,48 డివిజన్లలో మేయర్ పునుకొల్లు నీరజ లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు.

ఫీల్డ్‌అసిస్టెంట్ కుటుంబానికి చేయూత

సత్తుపల్లిరూరల్, జూన్21: అనారోగ్యంతో మృతిచెందిన ఓ ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి తోటి మిత్రులతో పాటు సత్తుపల్లి ఎంపీడీవో, ఈజీఎస్ కార్యాలయాల సిబ్బంది అండగా నిలిచారు. మండలంలోని రామానగరానికి చెందిన వీ.ప్రసాద్ మృతిచెందగా తోటి మిత్రులతో పాటు ఎంపీడీవో నాగేశ్వరరావు, ఈజీఎస్ ఏపీవో ఎం.బాబు, కార్యాలయ సిబ్బంది నుంచి సేకరించి రూ.58,500 నగదును పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఈ పాస్ పుస్తకాన్ని మృతుని కుటుంబ సభ్యులను శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో అందజేశారు.

ప్రజా సమస్యలపై పోరాడాలి

తల్లాడ, జూన్21: ప్రజాసమస్యలపై పోరాడటం సీపీఎం కార్యకర్తల దినచర్యగా ఉండాలని సీపీఎం సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాచర్ల భారతి అన్నారు. శుక్రవారం తల్లాడలో సీపీఎం మండలస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఐనాల రామలింగేశ్వరరావు, నాయకులు శీలం సత్యనారాయణరెడ్డి, శీలం పకీరమ్మ, నల్లమోతు మోహన్‌రావు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులే

బోనకల్, జూన్21: ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులు మాత్రమేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరావు తెలిపారు. మండలంలోని జానకీపురం గ్రామంలో శుక్రవారం సీపీఎం మండల రాజకీయ శిక్షణ తరగతులను పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చింతలచెర్వు కోటేశ్వరావు ప్రారంభించారు. సమావేశంలో జిల్లా, మండల నాయకులు బండారు రమేష్, దొండపాటి నాగేశ్వరావు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

సత్తుపల్లిరూరల్, జూన్21: నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్న మండలంలోని కిష్టారం ఓసీ గని సమీపంలో ప్రమాదాల నియంత్రణకు సింగరేణి ఆధ్వర్యంలో చర్యలు తీసుకున్నట్లు పీవో ఎంవీ. నరసింహారావు తెలిపారు. సత్తుపల్లి డివిజన్ ఆర్అండ్‌బి అధికారుల చొరవతో ఓసీకి ఆనుకుని ఉన్న జాతీయ రహదారిపై వాహనదారులకు రక్షణ సూచికలైన రంబుల్ స్ట్రిప్స్ (స్పర్శ గజిబిజి కంపనం) ఏర్పాటు చేశారు. అజాగ్రత్తగా వెళ్లేవారికి, ప్రమాదాలను హెచ్చరించడంతో పాటు వేగనియంత్రణ కోసం వీటిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బి జేఈ నాగేశ్వరరావు, సింగరేణి సివిల్ ఇంజనీర్ రవికుమార్, సివిల్ సూపర్‌వైజర్ రవీందర్ పాల్గొన్నారు.

నేటినుంచి శ్రీకోదండ రామాలయంలో స్వర్ణోత్సవం

సత్తుపల్లి,జూన్21:సత్తుపల్లి నడిబొడ్డున వేంచేసియున్న శ్రీ కోదండ రామాలయంలో కోరిన కోర్కెలు తీర్చే శ్రీకోదండ రాముల వారి స్వర్ణోత్సవం శనివారం నుంచి మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా సాగనున్నాయి. ఈ సందర్భంగా అద్భుత శాంతి మహా సంప్రోక్షణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు రామాలయ ట్రస్ట్ అధ్యక్షకార్యదర్శులు కొత్తూరు సత్యనారాయణ, అనుమోలు సురేష్ కుమార్ తెలిపారు.నేడు మూలవిరాట్‌లకు అభిషేకం, పుష్పయాగం, 23న హనుమాన్‌చాలీసా అనంతరం శ్రీసీతారామ కల్యాణం, శ్రీశ్రీనివాసకల్యాణం, 24న శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. చివరి రోజు భక్తులకు నారాయణసేవ (అన్నసమారాధన),



సత్తుపల్లిలో ముస్తాబవుతున్న ఆలయం

సాయంత్రం మంగళవాయిద్యాములచే స్వామివారి ఊరేగింపు చేయనున్నట్లు పేర్కొన్నారు.

భూమి విలువలపై డ్రాఫ్ట్ పబ్లికేషన్ చేయాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

ఖమ్మంకలెక్టరేట్, జూన్21: జిల్లాలోని భూముల మార్కెట్ విలువలపై జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. తహసీల్దార్‌లు, మండల అభివృద్ధి అధికారులు, సబ్ రిజిస్ట్రార్‌లు, మునిసిపల్ కమీషనర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, భూముల మార్కెట్ వాల్యూపై ప్రతి రెండేళ్లకు సమీక్ష జరుగుతుందన్నారు. గ్రామాలు, పట్టణాలు స్థానిక పరిస్థితులను బట్టి భూముల విలువ ఉంటుందని తెలిపారు. ఈ నెల 29 వ తేదీ వరకు సంబంధిత అధికారులు భూమి విలువ డ్రాఫ్ట్ పబ్లిష్ చేయాల్సి ఉంటుందన్నారు. సవరించిన ధరలు ఉన్నత స్థాయి ఆదేశాల మేరకు ఆగస్టు నుంచి అమలులో ఉంటాయని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో వినోద్, జిల్లా రిజిస్ట్రార్ చిట్టీమల్ల అశోక్‌కుమార్, ఆర్డీవో గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ విద్యాలయాన్ని సందర్శించిన శ్రీనాథ కవి వారసుడు

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్21: ఖమ్మం గుట్టల బజార్ శ్రీరామకృష్ణ విద్యాలయాన్ని శుక్రవారం కవి సార్వభౌమ శ్రీనాథుని వంశీకులు శ్రీనాథ కవి వారసుడు కావూరి శ్రీనివాసశర్మ సందర్శించారు. ఆయన పురావస్తు శాఖలో పనిచేసిన సమయంలో ఎన్నో తాళ్లపత్రా గ్రంథాలను తెలుగులోకి అనువాదించారు.



ఎన్‌టీఏ ను రద్దు చేయాలి

విద్యార్థి, ప్రజాసంఘాలు నిరసన ర్యాలీ

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 21: జాతీయ స్థాయి విద్యా పరీక్షల నిర్వాహణలో విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్, సీపీఎం,సీపీఐ, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్, ఎస్టీ రాజకీయ పార్టీల అనుబంధ విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల బాధ్యులు డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలు నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ ఆయా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం పలు కాలేజీల విద్యార్థులతో కలిసి ఖమ్మంలో నిరసన ర్యాలీ చేపట్టారు. కేంద్రవిద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నా బీజేపీ ప్రభుత్వం ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నించారు. తక్షణమే స్వతంత్ర సంస్థతో విచారణ చేపట్టాలని కోరారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు యడ్లపల్లి సంతోష్, చింతల రమేశ్, ఇటికాల రామకృష్ణ, వంగూరి వెంకటేష్, ప్రవీణ్, బసీరుద్దీన్, నాలబాల రామకృష్ణ, రాకేష్, మస్తాన్, కూరపాటి రమేష్, ఆశిఫ్, ప్రేమ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి కోర్టులో సౌకర్యాలకు కృషి

జిల్లా న్యాయాధికారి రాజగోపాల్

సత్తుపల్లిరూరల్, జూన్21: సత్తుపల్లి కోర్టులో అన్ని మౌళిక సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని జిల్లా జడ్జి జీ.రాజగోపాల్ తెలిపారు. శుక్రవారం ఆయన సత్తుపల్లి కోర్టును సందర్శించి కోర్టు ఆవరణను పరిశీలించి న్యాయాధికారులు, న్యాయవాదులతో సమావేశమయ్యారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడమ్స్ పలు సమస్యలను జిల్లా జడ్జి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం నిర్మాణంలో ఉన్న క్వార్టర్స్ నిర్మాణాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో 6వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎం.శ్రీనివాస్, సీనియర్ సివిల్‌జడ్జి ఎస్‌కే.మీరా ఖాసీం సాహెబ్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి వీ.లావణ్య, న్యాయవాదులు రమేష్, పిన్నం జానకీ రామారావు, బుజ్జీసాహెబ్, లక్ష్మణరావు, విజయ కుమార్, కృష్ణప్రసాద్, వెంకటకృష్ణ, అబ్దుల్‌భాషా పాల్గొన్నారు.

జిల్లా న్యాయాధికారిని కలిసిన ఆర్యవైశ్య సంఘం బాధ్యులు

సత్తుపల్లి: సత్తుపల్లి కోర్టును శుక్రవారం సందర్శించిన జిల్లా జడ్జి జీ.రాజగోపాల్‌ను సత్తుపల్లి పట్టణ, మండల ఆర్యవైశ సంఘం, వాసవీక్లబ్ సత్తుపల్లి గ్రేటర్ బాధ్యులు



రాజగోపాల్‌ను సన్మానిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

మర్యాదపూర్వకంగా కలిశారు. జ్ఞాపికను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ మండల, పట్టణ అధ్యక్షులు వందనపు సత్యనారాయణ, సోమిశెట్టి శ్రీధర్, వాసవీక్లబ్ అధ్యక్షుడు పసుమర్తి గోపాలరావు, రీజినల్ చైర్మన్ అత్తులూరి పురుషోత్తం, జోన్ చైర్మన్ పోకూరి కృష్ణప్రసాద్, సభ్యులు రతికంటి సత్యబాబు, ఒంటిపల్లి ఆదినారాయణ, అడపా సత్యనారాయణ, పెనుగొండ రమేష్, గుడిమెట్ల రామకృష్ణ, గుండు ఉమామహేశ్వరరావు, దారా శ్రీనివాసరావు, వనమా నరేష్ తదితరులు పాల్గొన్నారు.